సాక్షి
నాగర్‌కర్నూల్
శుక్రవారం । 3 । నవంబర్ । 2023



పట్టభద్రులకే పట్టాభిషేకం
వనపర్తి నియోజకవర్గంలో ఇప్పటి వరకు విద్యావంతులే ఎమ్మెల్యేలు కావడం విశేషం.
వివరాలు IIలో ▸



వేళకు రాని బస్సులు
బస్సులు సమయానికి రాక ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
వివరాలు IIIలో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 32.0 /17.9
రోజంతా ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. రాత్రి కాస్త చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మద్యం అక్రమంగా తరలిస్తే చర్యలు

కందనూలు: మద్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ ఈఎస్ ఫయాజుద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి గురువారం వరకు నమోదైన కేసులు, సారా, మద్యం స్వాధీనం వివరాలను వెల్లడించారు. గుడుంబా కేసులు 135, సారా స్వాధీనం 1,046 లీటర్లు, బెల్లం ఊట ధ్వంసం 50 వేల లీటర్లు, బెల్లం 19 వేల కిలోలు స్వాధీనం చేసుకొని 88 మందిని బైండోవర్లు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 80 బెల్ట్ షాపులపై కేసులు నమోదు చేశామని, 828 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని, 21 వాహనాలను సీజ్ చేసి, 137 మందిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

అక్రమ మద్యానికి అడ్డుకట్ట
ఎన్నికల సందర్భంగా మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎక్సైజ్‌శాఖ వేరిట్ యాప్ రూపొందించిందని ఎక్సైజ్ ఈఎస్ ఫయాజుద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొనుగోలు చేసిన మద్యం సీసాలు మన రాష్ట్రానికి చెందినవా.. లేక ఇతర రాష్ట్రానికి చెందిందా తెలుసుకోవడానికి యాప్‌లో ఉన్న స్కానర్ ద్వారా తెలుసుకోవచ్చని.. ఒకవేళ అక్రమమని తేలితే టోల్‌ఫ్రీ నంబర్ 1800 4252 523 కి ఫిర్యాదు చేయాలని కోరారు. యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఉద్యమ నాయకుడు నాగం



సాక్షి, నాగర్‌కర్నూల్: తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాటం చేసిన నాగం జనార్దన్‌రెడ్డికి కాంగ్రెస్‌పార్టీలో అవమానం జరిగిందని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డితో కలిసి జిల్లాకేంద్రంలోని తెలంగాణభవన్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పదవులు, స్వార్థ రాజకీయాల కోసం రోజుకో పార్టీ మారే నాయకులకు కాంగ్రెస్ టికెట్లు ఇచ్చి, పార్టీ కోసం పనిచేసిన వారికి అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. ఇకపై నాగం జనార్దన్‌రెడ్డి మార్గదర్శనంలో తాను పనిచేస్తానని చెప్పారు.

మర్రి గెలుపునకు కృషి చేస్తా : మాజీ మంత్రి నాగం
నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్‌పార్టీ ఉనికి కోల్పోయిన సమయంలో శ్రమించి పార్టీని బలోపేతం చేశానని మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. బిజినేపల్లి సభతో పార్టీలో ఉత్సాహం వచ్చాకే ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి కన్ను కాంగ్రెస్‌పై పడిందని చెప్పారు. ఎమ్మెల్సీ పదవి నష్టపోకుండా దామోదర్‌రెడ్డి టెక్నికల్‌గా బీఆర్‌ఎస్‌కు కాకుండా మనుగడలో లేని టీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేశారని విమర్శించారు. ప్రజా సమస్యలపై అవగాహన లేనివారికి కాంగ్రెస్ టికెట్లు ఇచ్చి తనను అవమానించిందని మండిపడ్డారు. తనతో దూరంగా ఉన్న కార్యకర్తలు, నాయకులను సైతం కలిసి బీఆర్‌ఎస్ గూటికి చేర్చుతానన్నారు. నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి జనార్దన్‌రెడ్డి గెలుపునకు కృషిచేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జక్కా రఘునందన్‌రెడ్డి, బైకని శ్రీనివాస్‌యాదవ్, నాగం శశిధర్‌రెడ్డి, లక్ష్మయ్య, బాలాగౌడ్, పాండు తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతులకు అవగాహన

బిజినేపల్లి: మండలంలోని పాలెం కృషి విజ్ఞాన కేంద్రంలో మహిళ రైతులకు పత్తి కోత సంచుల వినియోగంపై శాస్త్రవేత్తలు గురువారం అవగాహన కల్పించారు. కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డా. జోత్స్న మాట్లాడుతూ.. పత్తి కోతకు ఉపయోగించే సంచులను పాతశాల బ్యాగుల్లా భుజానికి వేసుకుంటే పత్తి తీసి అందులో వేసుకోవడం సులభం అవుతుందన్నారు.

- ఉమ్మడి జిల్లాలో 6 స్థానాల్లో అభ్యర్థుల పేర్లు వెల్లడి
- ఇప్పటివరకు 9 మంది ఖరారు, మరో ఐదు పెండింగ్
- జనసేనతో పొత్తుపై లుకలుకలు
- హైదరాబాద్‌లో రాష్ట్ర కార్యాలయం వద్ద నాయకుల నిరసన

ఎట్టకేలకు..

బీజేపీ మూడో జాబితా..

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: అదిగో.. ఇదిగో అంటూ బీజేపీ అభ్యర్థుల మూడో జాబితాపై నాలుగైదు రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ఎట్టకేలకు రాష్ట్రంలోని 35 శాసనసభ నియోజకవర్గాల్లో బరిలో నిలిచే అభ్యర్థులను పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. ఇందులో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఆరు సెగ్మెంట్లకు చోటు దక్కింది. ఇంతకు మునుపు తొలి జాబితాలో రెండు, రెండో జాబితాలో ఒక స్థానంతో కలుపుకుని.. మొత్తం తొమ్మిది మంది అభ్యర్థులు ఖరారయ్యారు. మొత్తం 14 నియోజక వర్గాలు ఉండగా.. ఐదు పెండింగ్ పెట్టారు.

జనసేనతో పొత్తు పై లుకలుకలు
బీజేపీ, జనసేన పొత్తులో భాగంగా రాష్ట్రంలో పలు నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించకుండా కమలం అధిష్టానం పెండింగ్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో పలు సెగ్మెంట్లలో బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్న ఆశావహులు అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఆ పార్టీలో లుకలుకలు వెలుగుచూస్తున్నాయి. నాగర్‌కర్నూల్ నియోజకవర్గం నుంచి దిలీపాచారి టికెట్ ఆశిస్తుండగా.. ఈ స్థానాన్ని జనసేనకు ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో దిలీపాచారి హైదరాబాద్‌లో బీజేపీ కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలపడం అసమ్మతికి నిదర్శనంగా నిలుస్తోంది.

ఇంకా సస్పెన్స్‌పై అభ్యర్థుల్లో నైరాశ్యం
శుక్రవారం నుంచి నామినేషన్లు ప్రారంభం అవుతున్నా.. ఉమ్మడి జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో బీజేపీ ఇంకా అభ్యర్థులను ప్రకటించలేదు. నామినేషన్లకు చివరి గడువు ఈ నెల 10 వరకు ఉండగా, అప్పటివరకు వేచి చూసే అవకాశాలు ఉన్నాయి. ఇతర పార్టీల్లోని అసంతృప్తులు, టికెట్ దక్కని నేతలు బీజేపీలో చేరే అవకాశం ఉండటంతో ఆ దిశగా బీజేపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో పార్టీ అభ్యర్థులతో పాటు శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది.



తొలి విడతలో..
1. టి.ఆచారి (కల్వకుర్తి)
2. ఎల్లేని సుధాకర్‌రావు (కొల్లాపూర్)

2వ విడతలో..
1. ఏపీ మిథున్‌రెడ్డి (మహబూబ్‌నగర్)

3వ జాబితాలో..
1. రతంగ పాండురెడ్డి (నారాయణపేట)
2. జలంధర్ రెడ్డి (మక్తల్)
3. జక్కుల చిత్తరంజన్‌దాస్ (జడ్చర్ల)
4. అశ్వత్థామరెడ్డి (వనపర్తి)
5. దేవని సతీశ్ మాదిగ (అచ్చంపేట)
6. అందె బాబయ్య (షాద్‌నగర్)

పెండింగ్ స్థానాలు ఇవే..
అలంపూర్, దేవరకద్ర, నాగర్‌కర్నూల్, కొడంగల్, గద్వాల

నామినేషన్ల పర్వం షురూ

మొదలైన అసెంబ్లీ ఎన్నికల సందడి



నాగర్‌కర్నూల్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయం

- ఏర్పాట్లు పూర్తిచేసిన రిటర్నింగ్ అధికారులు
- 10వ తేదీ వరకు స్వీకరణకు అవకాశం

సాక్షి, నాగర్‌కర్నూల్: అసెంబ్లీ ఎన్నికల పర్వం మొదలైంది. శుక్రవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుండగా.. ఇందుకు ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ నెల 10వ తేదీ వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఆదివారం సెలవురోజు నామినేషన్ల స్వీకరణ ఉండదు. రాజకీయ, రిజిస్టర్ పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు నామినేషన్లు వేయడానికి సన్నద్ధమవుతున్నారు. అసంపూర్తిగా, అక్షర దోషాలు, తప్పులు, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా నామినేషన్లు వేస్తే తిరస్కరించే అవకాశం ఉన్నందున ఆచితూచి వ్యవహరిస్తున్నారు. తొలిరోజు నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు ఆసక్తి కనబర్చడం లేదని తెలుస్తోంది.

నామినేషన్ల స్వీకరణ సమయం:
ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు

నామినేషన్లకు చివరి గడువు :	నామినేషన్ల పరిశీలన:	ఉపసంహరణకు చివరి గడువు:
నవంబర్ 10	నవంబర్ 13	నవంబర్ 15

పోలింగ్: నవంబర్ 30	ఫలితాలు: డిసెంబర్ 3

ఇవీ నిబంధనలు..
- రాష్ట్రంలో ఎక్కడైనా ఓటు హక్కు కలిగి ఉండి.. 25 ఏళ్లు నిండిన ఎవరైనా నామినేషన్ వేయవచ్చు. నామినేషన్ వేసే అభ్యర్థిని ప్రతిపాదించే వ్యక్తి మాత్రం అదే నియోజకవర్గంలో ఓటు హక్కు తప్పనిసరిగా కలిగి ఉండాలి.
- గుర్తింపు పొందిన పార్టీలకు ఒకరు, స్వతంత్ర అభ్యర్థులకు పది మంది ప్రతిపాదించాలి.
- నామినేషన్ దాఖలు సమయంలో అభ్యర్థితో కలిపి నలుగురిని కార్యాలయంలోకి అనుమతిస్తారు.
- పోటీ చేసే అభ్యర్థి ఓసీ అయితే రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలి. నగదుగా లేదా బ్యాంకు చలానా రూపంలో చెల్లించే అవకాశం ఉంది.
- ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు తహసీల్దార్ ఇచ్చిన కుల ధ్రువీకరణ పత్రాన్ని నామినేషన్‌కు జతపర్చాల్సి ఉంటుంది.
- ఒక అభ్యర్థి నాలుగు సెట్లు వేయవచ్చు.
- నామినేషన్ సమయంలో ప్రమాణం చేయాల్సి ఉంటుంది.
- నామినేషన్‌తో పాటు రూ.10న్యూడీషియల్ స్టాంపుపేపరుపై అఫిడవిట్ సమర్పించాలి.
- అఫిడవిట్‌ను ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ లేదా నోటరీ చేయించాలి.

ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎక్కువగా నవంబర్ 8, 9 తేదీల్లోనే నామినేషన్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఆర్‌ఓ నుంచి తీసుకోవాల్సిన పత్రాలు
- ప్రమాణం చేసినట్లు ధ్రువీకరణ పత్రం
- చెల్లించిన డిపాజిట్ మొత్తానికి రసీదు
- ఎన్నికల ఖర్చును నమోదు చేసే రిజిస్టర్లు
- స్క్రూటినీకి హాజరయ్యేందుకు నోటీసు
- నామినేషన్‌లో లోపాలు, జతపర్చాల్సిన పత్రాల పత్రం
- ఎన్నికల వ్యయానికి సంబంధించి ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 127–ఏ సూచనల పుస్తకం

కేంద్రాల వద్ద ఆంక్షలు..
ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్న ఆర్డీఓ కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అకౌంటింగ్ టీం, వీవీటీ, సీ–విజిల్ హెల్ప్‌డెస్క్‌తో పాటు నామినేషన్ సమయం రికార్డు చేసేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అభ్యర్థుల సందేహాలు నివృత్తి చేసేందుకు హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశారు. ఇతరులను అనుమతించకుండా కేంద్రానికి 100 మీటర్ల దూరంలో మార్కింగ్ చేశారు. 144 సెక్షన్ అమలులో ఉండనుంది. నామినేషన్లు వేసేందుకు వచ్చే అభ్యర్థి, ప్రతిపాదకులు, వారి వాహనాలను ఎన్నికల నిబంధనల మేరకు అనుమతించేలా డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు


మాట్లాడుతున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్: జిల్లాలో మాతృ మరణాలకు వైద్య సిబ్బంది అలసత్వమే కారణమని విచారణలో తేలితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ హెచ్చరించారు. గురువారం సమీకృత కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు సంబంధించి జిల్లా కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో జరిగిన 4 మాతృ మరణాలకు గల కారణాలపై రఘుపతిపేట, తాడూరు, సిద్దాపూర్, లింగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, వైద్యసిబ్బంది, మృతుల కుటుంబ సభ్యులతో మరణాలకు గల కారణాలపై సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లాలో మాతృ మరణాలకు ఆస్కారం లేకుండా వైద్యులు, సిబ్బంది పనిచేయాలన్నారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ మహిళలకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలిస్తూ వైద్య సాయం అందించాలని సూచించారు. వైద్యాధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యం అందించాలన్నారు. రాబోయే సమీక్ష సమావేశం నాటికి మాతృ, శిశు మరణాలు ఉండకూడదని.. ఏవైనా జరిగితే మెజిస్టీరియల్ ఎంక్వైరీ ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. సుధాకర్‌లాల్, నాగర్‌కర్నూల్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి గైనకాలజిస్ట్ డా. నీలిమ, అచ్చంపేట, కల్వకుర్తి ఆస్పత్రుల గైనకాలజిస్టులు డా. స్రవంతి, డా. విజయ్‌కుమార్, రఘుపతిపేట, సిద్దాపూర్, తాడూర్, లింగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది, మృతుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

అడవుల అభివృద్ధి ప్రశంసనీయం

పీసీసీఎఫ్ రాకేష్ మోహన్ డోబ్రియాల్

మన్ననూర్: దోమలపెంట రేంజ్ పరిధిలోని అక్కమహాదేవి గుహలు, కృష్ణా రివర్ బోట్ పెట్రోలింగ్, ఆక్టోపస్, వ్యూ పాయింట్, వజ్రాల మడుగు, వాచ్ టవర్ తదితర ప్రాంతాల్లో గురువారం పీసీసీఎఫ్ రాకేష్ మోహన్ డోబ్రియాల్ అధికారులతో కలిసి పర్యటించారు. బేస్‌క్యాంపుల్లో ఉన్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో మాట్లాడారు. అటవి, వన్యప్రాణులకు శ్రీరామరక్ష అంటే ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, చెంచులేనని కొనియాడారు. అటవీశాఖ తరుపున అమలు చేస్తున్న ప్రమాదబీమా పత్రాలు ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి అందజేయాలని అధికారులను ఆదేశించారు. కొంతకాలంగా అడవుల అభివృద్ధి, వన్యప్రాణుల సంరక్షణకు అధికారులు, సిబ్బంది చేస్తున్న కృషి, పనితీరును ఓ దశలో ప్రశంసించారు. ఆయన వెంట ఫీల్డ్ డైరెక్టర్ క్షితిజ, డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డి, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌డీఓ శ్రీనివాస్, ఎఫ్‌డీఓలు విశాల్, తిరుమల్‌రావు, ఎఫ్‌ఆర్‌ఓలు ఆదిత్య, చంద్రకాంత్‌రెడ్డి, గురుప్రసాద్, రాజేందర్, డీఆర్‌ఓ రవికుమార్, శివకుమార్, మంజుల తదితరులు పాల్గొన్నారు.


బోట్‌లో ప్రయాణిస్తూ రికార్డులను పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ డోబ్రియాల్

ఎన్నికల పరిశీలకుల నియామకం

సాక్షి, నాగర్‌కర్నూల్: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల పరిశీలకులను నియమించింది. నియోజకవర్గాల వారీగా ఐఏఎస్ అధికారులను ఎన్నికల నిర్వహణ పరిశీలకులుగా, ఐపీఎస్ అధికారులను శాంతిభద్రతల నిర్వహణ పరిశీలకులుగా బాధ్యతలు అప్పగించింది. శుక్రవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండటంతో వీరు నేటి నుంచి ఎన్నికలు ముగిసే వరకు బాధ్యతలు నిర్వర్తిస్తారు. నియోజకవర్గాల్లోని ఎన్నికల ప్రక్రియను వీరు నిశితంగా పరిశీలించనున్నారు.

నియోజకవర్గం	సాధారణ పరిశీలకులు
నాగర్‌కర్నూల్	మిథిలేష్ మిశ్రా
అచ్చంపేట, కొల్లాపూర్	ఎస్.సతీశ్‌కుమార్
కల్వకుర్తి	శిల్పాశర్మ
శాంతిభద్రతల పరిశీలకులు..	
నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ : కేపీఏ ఇలియాస్	కల్వకుర్తి అజిత్‌సింగ్ యాదవ్

ఎన్నికలు శాంతియుతంగా నిర్వహిద్దాం


రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచనలు, సలహాలిస్తున్న ఆర్‌ఓ గోపీరాం

అచ్చంపేట రూరల్: అసెంబ్లీ ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు సహకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి గోపీరాం, డీఎస్పీ కృష్ణకిషోర్ కోరారు. గురువారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులు, పోలీసు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆర్‌ఓ గోపీరాం మాట్లాడారు. ఎన్నికల నియమావళిని విధిగా పాటించాలన్నారు. శుక్రవారం నుంచి నామినేషన్లను స్వీకరిస్తామని.. సభలు, సమావేశాల నిర్వహణకు స్థానిక పోలీస్ అధికారులతో, లౌడ్‌స్పీకర్ల అనుమతిని డీఎస్పీతో పొందాలని సూచించారు. ఊరేగింపుల్లో ఇతర అభ్యర్థులు, వారి పార్టీ ప్రతినిధుల దిష్టిబొమ్మలను కాల్చరాదన్నారు. ఆర్థిక, ఆర్థికేతర ప్రలోభాలకు ఓటరును గురి చేయరాదని తెలిపారు. డీఎస్పీ కృష్ణకిషోర్ మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో పలుచోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శైలేంద్రకుమార్, సీఐ అనుదీప్, ఎస్‌ఐలు గోవర్ధన్, గురుస్వామి, శేఖర్‌గౌడ్, నయాబ్ తహసీల్దార్ రాములునాయక్ పాల్గొన్నారు.

గడువులోగా బియ్యం ఇవ్వాలి


రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ సీతారామారావు

అదనపు కలెక్టర్ సీతారామారావు

కల్వకుర్తిరూరల్: రైస్‌మిల్లర్లు ఇచ్చిన గడువులోగా సీఎంఆర్ బియ్యం పూర్తిగా ఇవ్వకపోతే 2023–24 వానాకాలం వరి ధాన్యం కేటాయింపులు ఉండవని అడిషనల్ కలెక్టర్ సీతారామారావు హెచ్చరించారు. గురువారం సాయంత్రం కల్వకుర్తిలోని పలు రైస్‌మిల్లులను ఆయన తనిఖీ చేశారు. ఆయా మిల్లులకు ఎంత కోటా కేటాయించారు. ఇప్పటి వరకు ఇచ్చిన బియ్యం తదితర వివరాలను, రికార్డులను పరిశీలించారు. 2022–23 వానాకాలం 93 వేల మెట్రిక్ టన్నులు ఉండగా.. ఇంకా 65 వేల మెట్రిక్ టన్నుల బకాయి ఉన్నారని లెక్క తేల్చారు. ఈ నెల 30లోగా బకాయి బియ్యం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. తనిఖీల్లో జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి స్వామికుమార్, రైస్‌మిల్లర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు, జిల్లా మేనేజర్ బాలరాజు పాల్గొన్నారు.

- 'ఎన్–కోర్' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన ఎన్నికల సంఘం
- అభ్యర్థుల పూర్తి చిట్టా నిక్షిప్తం
- నామినేషన్ నుంచి అన్ని వివరాలు నమోదు చేయాలని ఆదేశం

పారదర్శకతకు పెద్దపీట

మద్దూరు: శాసనసభ ఎన్నికలను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. సాంకేతికతను వినియోగిస్తూ జవాబుదారీగా వ్యవహరించాలని నిర్ణయించింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల చిట్టాను ఓటరు ముందుంచనున్నారు. తాము ఎన్నుకోబోయే నేత చరిత్రలో నేర చరిత్ర ఏమైనా ఉందా ? అయన చదివిందెంత ? చేసిన అప్పులెన్ని? పోగేసిన ఆస్తులెన్ని ? ఎగ్గొటిన రుణాలెన్ని? ఇవన్నీ తెలిస్తే అభ్యర్థుల తీరుతెన్నులపై ఓటరు స్పష్టమైన అభిప్రాయానికి రావొచ్చు. ఆ ఉద్దేశంతోనే అఫిడవిట్ దాఖలులో ఎన్నికల సంఘం పలు నిబంధనలు పెట్టింది. అభ్యర్థి తెలిపిన వివరాలన్నీ ఓటరు ప్రత్యక్షంగా లేదా ఆన్‌లైన్ పద్ధతిలో పొందే అవకాశం కల్పించింది.

ఏ రోజుకారోజు వివరాల నమోదు..
నామినేషన్ల పర్వం నుంచి ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యే వరకు ప్రతీ అంశానికి సంబంధించిన వివరాలు ఎన్–కోర్ యాప్‌లో నమోదు చేయాలని ఎన్నికల సంఘం సంబంధిత అధికారులను అదేశించింది. అందిన నామినేషన్ అఫిడవిట్ సమాచారాన్ని ఏ రోజుకారోజు యాప్‌లో పొందుపరుస్తారు. గతంలో కొందరు అన్ని వివరాలను పూరించకుండా ఖాళీగా వదిలేసేవారు. ఈ సారి ఆ నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.



'ఎన్–కోర్ 'యాప్

ఎలా తెలుసుకోవచ్చంటే..
స్థానిక ఓటరు రిటర్నింగ్ అధికారులను సంప్రదిస్తే కోరిన అభ్యర్థి సమాచారాన్ని వెంటనే అందిస్తారు. ప్రత్యామ్నాయంగా ఎన్నికల సంఘం 'ఎన్–కోర్' అనే యాప్‌ను అందుబాటులో తీసుకొచ్చింది. దీని సాయంతో నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల పూర్తి వివరాలను పౌరులు తెలుసుకునే వీలుంది. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత సీఈసీ వెబ్‌సైట్‌లో అభ్యర్థుల పూర్తి సమాచారాన్ని అందుబాటులో ఉంచుతారు.

తప్పుడు వివరాలపై గతంలో కేసులు
రాష్ట్రంలో ముగ్గురు ఎమ్మెల్యేలకు సంబంధించిన అఫిడవిట్లపై దాఖలైన కేసుల్లో ఇటీవల న్యాయస్థానాలు సంచలన తీర్పు వెలువరించాయి. ఈ నేపథ్యంలో నామినేషన్ దాఖలు ప్రక్రియపై ఎన్నికల సంఘం మరింత పారదర్శకంగా వ్యవహరిస్తోంది. అసంపూర్తి అఫిడవిట్, తప్పుడు వివరాలు తదితరాలపై గతంలో సుప్రీంకోర్టులోనూ కేసు దాఖలవగా, 2013లో తీర్పు వెలువడింది. దీని ప్రకారం అఫిడవిట్‌లోని ఏ కాలమ్‌నూ ఖాళీగా ఉంచొద్దు. పొరపాటున వదిలేస్తే దాన్ని పూరించేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల అధికారిపై ఉంటుంది.

జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడిగా భేరారామ్ చౌదరి


పెద్దకొత్తపల్లి చెక్‌పోస్టు వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న భేరారామ్ చౌదరి

నాగర్‌కర్నూల్: జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడిగా ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ 2009 బ్యాచ్ రాజస్థాన్ క్యాడర్‌కు చెందిన భేరారామ్ చౌదరిని కేంద్ర ఎన్నికల సంఘం నియమించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన జిల్లా కేంద్రం కొల్లాపూర్ క్రాస్ రోడ్, తాడూర్, చంద్రకల్‌లోని చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉంటూ వాహన తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఎలాంటి అనుమతి లేకుండా నగదు, సామగ్రి జిల్లాలోకి ప్రవేశించకుండా చూడాలన్నారు. తనిఖీ చేసిన వాహన వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల్లోని రిజిస్టర్లను పరిశీలించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, ఎస్పీ, వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి, రవాణా నోడల్ అధికారి, ఎక్సైజ్ నోడల్ అధికారి, నియోజకవర్గాల సహాయ వ్యయ అధికారులు, వ్యయ పర్యవేక్షణ బృందం, పోలీసు నోడల్ అధికారి, ఆదాయపన్ను నోడల్ అధికారితో సమావేశం కానున్నారు. ఆయన వెంట లైజన్ అధికారి మన్సూర్ ఉన్నారు.

పట్టభద్రులకే పట్టాభిషేకం

వనపర్తి నియోజకవర్గంలో విలక్షణ తీర్పు

- సెగ్మెంట్‌లో పదహారుసార్లు ఎన్నికలు
- 1957లో పద్మానభరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక
- హ్యాట్రిక్‌కు అవకాశం ఇవ్వని ఓటర్లు

వనపర్తి: విలక్షణమైన తీర్పుకు వనపర్తి నియోజకవర్గం ప్రత్యేకం. ఇప్పటి వరకు నియోజకవర్గంలో మొత్తం పదహారు సార్లు ఎన్నికలు నిర్వహిస్తే.. మొదటి ఎమ్మెల్యే సురవరం ప్రతాపరెడ్డి నుంచి 2018లో భారీ మెజార్టీతో గెలుపొందిన ప్రస్తుత వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వరకు అందరూ ఉన్నత విద్యావంతులు కావడం విశేషం. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన పార్టీకి వ్యతిరేకంగా ఇక్కడి ఓటర్లు ఎక్కువ సార్లు తీర్పు నిచ్చారు. నిజాం నవాబు సామంతరాజుగా వనపర్తి సంస్థానాన్ని పాలించిన చివరి రాజు రాజా రామేశ్వరరావు సర్దార్ వల్లభాయ్ పటేల్‌తో చర్చలు జరిపి తెలంగాణలో సైనిక చర్యకు ముందే వనపర్తి సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేశారు. రాజారామేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ, దేశ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించారు. 1952లోనే వనపర్తి నియోజకవర్గంలో తొలి అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించగా, కాంగ్రెస్ తరఫున సురవరం ప్రతాపరెడ్డి ఎన్నికయ్యారు. 1957లో పద్మనాభరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా.. 1962, 1967 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున రాజవంశీయురాలు కుముదినిదేవి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.



వనపర్తి పట్టణ వ్యూ



మొదటి ఎమ్మెల్యే సురవరం ప్రతాపరెడ్డి



ఏకగ్రీవంగా ఎన్నికైన పద్మనాభరెడ్డి



రాజవంశీయురాలు కుముదినిదేవి

మొదటి ఎన్నికల్లో 48శాతం పోలింగ్..

వనపర్తి నియోజకవర్గంలో నిర్వహించిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో 48 శాతం ఓట్లు వేసి ఈ ప్రాంత ఓటర్లు చైతన్యవంతులుగా నిరూపించుకున్నారు. తొలి ఎన్నికల్లో 55,140 మంది ఓటర్లు ఉండగా.. 26,627 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ప్రభావం చూపించే అంశాలు..

నియోజకవర్గంలో అత్యధిక కుటుంబాలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత నియోజకవర్గంలోని ఖిల్లాఘనపురం, పెద్దమందడి, గోపాల్‌పేట, రేవల్లి, వనపర్తి మండలాల్లోని అత్యధిక ప్రాంతాలకు సాగునీటి లభ్యత చేకూరడం గత ఎన్నికల్లో అధికార పార్టీ గెలుపునకు ప్రధాన కారణమైంది. ఈ సారి ఎన్నికల్లోనూ ప్రభావం ఉంటుందని చెప్పవచ్చు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో నాలుగు దశాబ్దాల రోడ్ల విస్తరణ కల ఈసారి ఎన్నికల సమయానికి సాకారమైంది. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లలో 34.41 శాతం 91,419మంది జిల్లా కేంద్రంలోనే ఉన్నారు. 2023 సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో రోడ్ల విస్తరణ ప్రభావం ఉంటుందని మేధావి వర్గం చర్చించుకుంటోంది.

హ్యాట్రిక్‌కు అవకాశం ఇవ్వని ఓటర్లు..

2007లో నియోజకవర్గాల పునర్విభజన సమయంలో కొన్ని మండలాల మార్పు చేశారు. తొలి ఎన్నికల నుంచి 2018 వరకు పదహారు సార్లు ఎన్నికలు నిర్వహిస్తే.. ఇప్పటి వరకు ఏ నేతకూ హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వలేదు ఇక్కడి ఓటర్లు.

నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల వివరాలు..

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	సాధించిన ఓట్లు	సమీప అభ్యర్థి	సాధించిన ఓట్లు
1952	సురవరం ప్రతాపరెడ్డి (కాంగ్రెస్)	15,475	కందూరు రాంరెడ్డి (ఇండిపెండెంట్)	11,152
1952 ఉ.ఎ.	కందూరు రాంరెడ్డి (పీఎస్‌పీ)	9,088	జయరాములు (కాంగ్రెస్)	7,429
1957	పద్మనాభరెడ్డి (కాంగ్రెస్)	ఏకగ్రీవం		
1962	కుముదినిదేవి (కాంగ్రెస్)	27,387	జీఎస్.రెడ్డి (ఇండిపెండెంట్)	4,745
1967	కుముదినిదేవి (కాంగ్రెస్)	28,310	ఎం.జగన్నాథం (ఇండిపెండెంట్)	13,890
1972	అయ్యప్ప (కాంగ్రెస్)	22,446	డాక్టర్ ఎ.బాలకిష్టయ్య(ఇండిపెండెంట్)	20,757
1978	జయరాములు (కాంగ్రెస్.ఐ)	30,354	డాక్టర్ ఎ. బాలకిష్టయ్య (జనతా)	25,445
1983	డాక్టర్ ఎ.బాలకిష్టయ్య (టీడీపీ)	31,100	జయరాములు (కాంగ్రెస్)	27,110
1985	డాక్టర్ ఎ.బాలకిష్టయ్య (టీడీపీ)	43,401	జి.చిన్నారెడ్డి (కాంగ్రెస్)	31,943
1989	జి.చిన్నారెడ్డి (కాంగ్రెస్)	62,712	డాక్టర్ బాలకిష్టయ్య (టీడీపీ)	34,837
1994	రావుల చంద్రశేఖర్‌రెడ్డి (టీడీపీ)	62,789	జి. చిన్నారెడ్డి (కాంగ్రెస్)	40,807
1999	జి.చిన్నారెడ్డి (కాంగ్రెస్)	65,286	రావుల చంద్రశేఖర్‌రెడ్డి (టీడీపీ)	61,933
2004	జి.చిన్నారెడ్డి (కాంగ్రెస్)	64,239	లావణ్య (టీడీపీ)	60,264
2009	రావుల చంద్రశేఖర్‌రెడ్డి (టీడీపీ)	71,190	జి.చిన్నారెడ్డి (కాంగ్రెస్)	60,602
2014	జి.చిన్నారెడ్డి (కాంగ్రెస్)	59,543	ఎస్. నిరంజన్‌రెడ్డి (బీఆర్ఎస్)	55,252
2018	ఎస్.నిరంజన్‌రెడ్డి (బీఆర్ఎస్)	1,11,956	జి.చిన్నారెడ్డి (కాంగ్రెస్)	60,271



వనపర్తి నియోజకవర్గం చిత్రపటం



వనపర్తి రాజమహల్

వలసల ప్రాంతానికే వలసలు..

నియోజకవర్గంలో సాగునీటి లభ్యతతో వలసలు పూర్తిగా తగ్గిపోయాయి. ఇక్కడ వరి నాటేందుకు ఇతర రాష్ట్రాల నుంచి వలసలు రావడం గమనార్హం. మునుపు పూరిగుడిసెలతో దర్శనమిచ్చే పల్లెసీమలు నేడు ఆర్‌సీసీ ఇళ్లతో దర్శనమిస్తున్నాయి. ఈ మార్పును అధికార పార్టీ తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తోంది.

బీజేపీ అభ్యర్థులు వీరే..

నారాయణపేట నియోజకవర్గం

పేరు: కొత్తకాపు రతంగపాండురెడ్డి
తల్లిదండ్రులు: రంగమ్మ, తిమ్మారెడ్డి
భార్య: రత్నమాల
పిల్లలు: రాజేష్‌రెడ్డి, శ్వేత
స్వస్థలం: సింగారం (నారాయణపేట మండలం)
పుట్టినతేది: 25-08-1965
విద్యార్హత: ఇంటర్మీడియట్
రాజకీయ నేపథ్యం: చిన్నతనం నుంచే ఆర్ఎస్ఎస్ భావాలు అందిపుచ్చుకుని బీజేపీ కార్యకర్తగా పనిచేస్తున్నారు. 1989 నుంచి 2003 వరకు గ్రామ, మండల పార్టీ పదవుల్లో కొనసాగారు. 2003 నుంచి 2006 వరకు మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడిగా, 2006 నుంచి 2009 వరకు కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడిగా, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. 2009 నుంచి 2010 వరకు ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా, 2010 నుంచి 2018 వరకు జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు.
- 1995-2000 వరకు ఎంపీపీగా బాధ్యతలు నిర్వహించారు. 2014లో స్వతంత్ర్య అభ్యర్థిగా, 2018లో బీజేపీ అభ్యర్థిగా నారాయణపేట నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు. 2002లో తాగు, సాగునీటికి పాదయాత్ర చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేశారు.

జడ్చర్ల నియోజకవర్గం

పేరు: జె.చిత్తరంజన్‌దాస్
భార్య: నీరజ
సంతానం: ముగ్గురు కూతుళ్లు
పుట్టిన తేదీ: 19-06-1951
విద్యార్హత: బీకాం
సామాజిక వర్గం: ఓబీసీ (ముదిరాజ్)
స్వస్థలం: కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ జిల్లా
రాజకీయ నేపథ్యం: కల్వకుర్తి ఎమ్మెల్యేగా రెండు సార్లు (1985-89, 1989-94) ఎన్నికయ్యారు. కార్మిక, ఉపాధి కల్పన, పర్యాటక శాఖ మంత్రిగా పనిచేశారు. టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావును ఓడించి జాయింట్ కిల్లర్‌గా పేరు పొందారు. 2019 వరకు రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్‌గా కొనసాగారు. టీడీపీ, బీఆర్ఎస్‌లో కొనసాగి.. ఇటీవల బీజేపీలో చేరారు.

అచ్చంపేట నియోజకవర్గం

పేరు: దేవని సతీష్‌మాదిగ
పుట్టిన తేదీ: 10-08-1969
విద్యార్హత: డిగ్రీ
తల్లిదండ్రులు: శేషమ్మ, కిష్టయ్య,
భార్య: సుగుణకళ
పిల్లలు: సూరజ్‌బాబు, సఖ్య
వృత్తి: వ్యాపారం
రాజకీయ నేపథ్యం: విద్యార్థి దశలోనే ఎమ్మార్పీఎస్ తరఫున పలు ఉద్యమాల్లో పాల్గొన్నారు. 2002-09 వరకు బీఆర్ఎస్ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రెసిడెంట్‌గా పనిచేశారు. 2006లో బీఆర్ఎస్ నుంచి బిజినేపల్లి జెడ్పీటీసీగా పోటీ చేశారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి నాగర్‌కర్నూల్ ఎంపీగా పోటీపడ్డారు. 2009 నుంచి 2017వరకు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా పని చేశారు. 2017లో రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. 2022 మే 5న బీజేపీలో చేరి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పని చేస్తున్నారు.

మక్తల్ నియోజకవర్గం

పేరు: మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి
పుట్టిన తేది: 30-10-1964
తల్లి: పార్వతమ్మ
తండ్రి: మాదిరెడ్డి శివారెడ్డి
భార్య: పద్మజారెడ్డి
పిల్లలు: డాక్టర్ నిశికారెడ్డి, రిగ్వేద్‌రెడ్డి
విద్యార్హత: బీకాం
రాజకీయం నేపథ్యం: 1987లో నర్వ సింగిల్‌విండో వైస్‌చైర్మన్‌గా పనిచేశారు. 2018లో మక్తల్ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేయగా, 30,247 ఓట్లు వచ్చాయి.

షాద్‌నగర్ నియోజకవర్గం

పేరు: అందె బాబయ్య
స్వస్థలం: ఏబీ కాలనీ, ఏబీ గార్డెన్ విల్లాస్, షాద్‌నగర్
పుట్టినతేది: 05-08-1959
విద్యార్హత: ఇంటర్మీడియట్
తల్లిదండ్రులు: బాలమ్మ, బాలయ్య
భార్య: కిష్టమ్మ
పిల్లలు: రాజేశ్వర్, రాఘవేందర్, నర్సింహులు
సామాజిక వర్గం: బీసీ (ముదిరాజ్)
రాజకీయ నేపథ్యం: 1982లో టీడీపీలో చేరిక, ఫరూఖ్‌నగర్ పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. 1995 నుంచి 2000 వరకు ఫరూఖ్‌నగర్ మండల టీడీపీ అధ్యక్షుడిగా కొనసాగారు. అనంతరం రెండుసార్లు తెలుగు రైతు అధ్యక్షుడిగా పనిచేశారు. 2001 నుంచి 2005 వరకు ఎంపీటీసీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. 2014లో బీఆర్ఎస్‌లో చేరారు. 2017 నుంచి 2021 వరకు బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారు. 2021 మేలో బీజేపీలో చేరి.. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతున్నారు.

వనపర్తి నియోజకవర్గం

పేరు: ఈ.అశ్వత్థామరెడ్డి
పుట్టిన తేది: 13-10-1965
విద్యార్హత: పదవ తరగతి (ఇంటర్ మధ్యలోనే ఆపేశారు)
తల్లిదండ్రులు: సౌభాగ్యమ్మ, జనార్దన్‌రెడ్డి
స్వస్థలం: బలిజపల్లి-జంగమాయపల్లి (జంట గ్రామాలు), పెద్దమందడి మండలం
భార్య: అరుణ
పిల్లలు: విరాజిత్‌రెడ్డి, భవ్యశ్రీరెడ్డి
నేపథ్యం: 1998లో ఆర్టీసీ డ్రైవర్ కం మెకానిక్‌గా ఉద్యోగంలో చేరారు. కొంతకాలం తర్వాత పదోన్నతిపై కంట్రోలర్‌గా బాధ్యతలు స్వీకరించి 2021లో ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆర్టీసీ యూనియన్ ఎస్ఎంయూలో కొంతకాలం పని చేశారు. తర్వాత తెలంగాణ మజ్దూర్ యూనియన్‌లో చేరారు. తెలంగాణ ఉద్యమం, సకలజనుల సమ్మెకాలంలో ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఉద్యమించారు.

ఆ ముగ్గురికి వరించని ఎమ్మెల్యే గిరి!

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: గతంలో పాలమూరు మున్సిపల్ చైర్మన్లుగా వ్యవహరించిన ముగ్గురు కాంగ్రెస్ నేతలు ఆ తర్వాత శాసనసభకు పోటీ చేసినా ఎమ్మెల్యే గిరి వరించలేదు. 1952లో మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ ఏర్పాటైంది. దీనికి 1981 నుంచి 1986 వరకు తిరిగి 1995 నుంచి 2000 వరకు రెండుసార్లు జి.సహదేవ్ యాదవ్ చైర్మన్‌గా కాంగ్రెస్ నుంచి ఎన్నికయ్యారు. ఇక 2000 నుంచి 2005 వరకు ముత్యాల ప్రకాష్, 2005 నుంచి 2010 వరకు ఒబేదుల్లా కొత్వాల్ చైర్మన్‌గా పనిచేశారు. కాగా, సహదేవ్‌యాదవ్ 1985లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి, 1999లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగినా ఓటమి పాలయ్యారు. 2012లో జరిగిన ఉపఎన్నికల్లో ముత్యాల ప్రకాష్ కాంగ్రెస్ నుంచి నిలబడినా గెలుపు సాధ్యం కాలేదు. ఇక 2014 ఎన్నికల్లో ఇదే పార్టీ నుంచి ఒబేదుల్లాకొత్వాల్‌కు టికెట్ దక్కినా ఓటమి చవి చూశారు. అయితే 1962 నుంచి 1967 వరకు ఇదే మున్సిపల్ చైర్మన్‌గా ఇబ్రహీం అలీ అన్సారి వ్యవహరించారు. అనంతరం జరిగిన శాసనసభ ఎన్నికల్లో రెండుసార్లు ఈయన ఎన్నికయ్యారు. అప్పట్లో కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రి హయాం (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్) లో రాష్ట్ర ఆరోగ్య, అటవీ శాఖ మంత్రిగానూ పనిచేశారు. ఇలా ఒక్కరు తప్పితే మిగతా ముగ్గురు నేతలు శాసనసభలో అడుగు పెట్టలేకపోయారు.

ఎన్నికల ప్రక్రియలో వీరే కీలకం

- జిల్లా అధికారి నుంచి బీఎల్‌ఓ దాక సమన్వయంతోనే పనులు చకచక

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎన్నికల నిర్వహణ ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన అంశం. ఓటు హక్కుతో ప్రజలు తమకు నచ్చిన వారిని ఎన్నుకునే ప్రక్రియ. ఓటరు నమోదు నుంచి పోలింగ్.. లెక్కింపు వరకు అధికార యంత్రాంగానికి శ్రమ బాగానే ఉంటుంది. కింది స్థాయి బీఎల్‌ఓ మొదలుకొని జిల్లా ఎన్నికల అధికారి వరకు సమన్వయంతో విధులు నిర్వహిస్తేనే ఎన్నికలు సజావుగా సాగుతాయి. పనులు చురుకుగా ఉంటాయి. ఇందుకోసం అధికారులకు అప్పగించిన బాధ్యతలు సమర్థంగా నిర్వహించాలి.

జిల్లా ఎన్నికల అధికారి..
కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. అధికారులకు విధుల కేటాయింపు మొదలుకొని.. వారికి ఇచ్చే శిక్షణ ఇతర కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. నిత్యం సమీక్షల ద్వారా అధికారులకు దిశానిర్దేశం చేస్తారు. ఓటరు జాబితా తయారీ నుంచి ఓట్ల లెక్కింపు వరకు ఆయనదే బాధ్యత.

ప్రిసైడింగ్ అధికారి..
ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. పోలింగ్‌కు అవసరమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఇతర సామగ్రి తీసుకొస్తారు. ఆ కేంద్రం పూర్తి బాధ్యత ఆయనదే. ఓటింగ్ ముగిసిన తర్వాత యంత్రాలను బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూంకు తరలిస్తారు. వీరికి సాయంగా అదనపు ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. వీరితో పాటు ముగ్గురు పోలింగ్ అధికారులు ఉంటారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడి పనిచేయాల్సి ఉంటుంది. పోలింగ్ ప్రారంభానికి ముందే ఈవీఎంలు పనితీరును పీఓలు చూడాల్సి ఉంటుంది.

బీఎల్‌ఓలు..
గ్రామ, నగరం, పట్టణ స్థాయిలో పనిచేసే వారే బీఎల్‌ఓలు (బూత్‌స్థాయి అధికారి) అర్హులైన వారందరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలి. కొత్తగా నమోదుతో పాటు మార్పులు, చేర్పులు, తొలగింపునకు కావాల్సిన దరఖాస్తులు వారి వద్ద ఉంటాయి. ఓటరు జాబితా తయారిలో పైస్థాయి అధికారులకు సహకారం అందిస్తారు.

రిటర్నింగ్ అధికారి (ఆర్వో)
ప్రతి నియోజకవర్గానికి ఒక రిటర్నింగ్ అధికారి ఉంటారు. వీరిని ఎన్నికల సంఘం నియమిస్తుంది. వారు తమ పరిధిలో ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తారు. నామినేషన్ స్వీకరణ మొదలు.. పరిశీలన, తిరస్కరణ, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, సిబ్బంది నియామకం, వారికి శిక్షణ, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి వరకు వారిదే బాధ్యత.



సెక్టోరియల్ అధికారి...

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించే బాధ్యత సెక్టోరియల్ అధికారిపై ఉంటుంది. ర్యాంప్ ఏర్పాటు, విద్యుత్, తాగునీరు, మౌలిక వసతులు కల్పించే విధంగా చూస్తారు. ఒక్కో సెక్టోరియల్ అధికారికి ఆరు పోలింగ్ కేంద్రాలు ఉంటాయి. పోలింగ్ కేంద్రంతో పాటు పరిసరాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలి. పోలింగ్ సమయంలో ఎలాంటి పొరపాట్లు జరిగినా వారిదే బాధ్యత.

సొంత పేర్లతో ప్రత్యేక పాటలు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పాట మనసుకు ప్రశాంతత ఇస్తుంది. అదే పాట ఓటరును ప్రసన్నం చేసుకునేందుకూ ఎంతో ఉపయోగపడుతుంది. అందుకే అన్ని పార్టీల అభ్యర్థులు ప్రత్యేక గీతాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఎన్నికల ప్రచారం కోసం తమ పేర్లతో సొంతంగా పాటలు, వీడియో ఆల్బంలు తయారు చేయించుకుంటున్నారు. ఒక్కో పార్టీ అభ్యర్థి కనీసం అరడజను పాటలతో కూడిన ఆల్బంలతో ప్రచార బరిలో దూకుతున్నారు. సొంతంగా రికార్డు చేయించినవి, ప్రాచుర్యం పొందిన ప్రచార గీతాలకు పేరడీలుగా రూపొందించి జనం వద్దకు వెళ్తున్నారు. పార్టీ అధిష్టానాలు అందించే గీతాలు వీటికి అదనం.

కళాకారులకు డిమాండ్..
గేయ, సంగీత దర్శకులతో పాటు, జానపద కళాకారులకు ఎన్నికల ప్రచారంలో మంచి డిమాండ్ నెలకొంది. ఎన్నికల సభలు, సమావేశాలు ప్రారంభమయ్యే ముందు అన్ని పార్టీలు తమ విధానాలను వివరిస్తూ కళాకారులతో ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలు ఇప్పిస్తున్నాయి. అభ్యర్థులు నియోజకవర్గాల పరిధిలో ప్రత్యేక జానపద బృందాలతో ప్రచారం చేయిస్తున్నారు. ప్రస్తుతం గేయ రచయితలు రూ. 3నుంచి5 లక్షలు తీసుకుని పాటలు అందిస్తున్నారు. ఒక్కో ఆల్బంలో కనీసం ఆరు దాకా పాటలుంటాయి. అభ్యర్థి వీడియోతో కూడిన పాట కావాలంటే ఇంకో రూ.లక్ష అదనం. ఈ గీతాలు ఎంతో మందికి ఉపాధినిస్తున్నాయి. ఒక వీడియో ఆల్బం రూపకల్పనకు గేయ రచయిత, సింగర్లు, రీ రికార్డింగ్ విభాగాల్లో నైపుణ్యమున్న వారంతా పనిచేయాల్సి ఉంటుంది.

భారీగా నగదు సీజ్

గద్వాల క్రైం: జిల్లావ్యాప్తంగా గురువారం చేపట్టిన వాహనాల తనిఖీల్లో రూ.3,22,500 నగదును గుర్తించి సీజ్ చేసినట్లు ఎస్పీ రితిరాజ్ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో రూ.50 వేల కంటే ఎక్కువ నగదును తరలి కూడదని తెలిపారు.



చేగుంట చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన నగదుతో పోలీసులు

వనపర్తి: జిల్లావ్యాప్తంగా చేపట్టిన వాహనాల తనిఖీల్లో రూ.4 లక్షల నగదు, 9 లీటర్ల మద్యం, 51 కేజీల నల్లబెల్లం పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్పీ రక్షితా కె.మూర్తి వెల్లడించారు. పెద్దమందడి మండలం వెల్టూరు చెక్‌పోస్టు వద్ద రూ. 4లక్షల నగదు, ఖిల్లాఘనపురంలో 9 లీటర్ల మద్యం, వనపర్తి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 51 కేజీల నల్లబెల్లం పట్టుబడినట్లు తెలిపారు.

జడ్చర్ల: పట్టణంలోని క్లబ్ రోడ్డులో తరలిస్తున్న రూ.9లక్షల నగదును పట్టుకుని సీజ్ చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. బ్యాంకులో డ్రా చేసిన నగదును బాదేపల్లికి చెందిన వంశీధర్‌రెడ్డి తన వాహనంలో తరలిస్తుండగా, పట్టుకుని ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

కృష్ణా: మండలంలోని చేగుంట చెక్‌పోస్టు వద్ద రూ.2,47,479 నగదును పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ విజయభాస్కర్ తెలిపారు. రాయచూర్ నుంచి గుర్మిట్‌కల్‌కు నీలకంఠ పాటిల్ అనే వ్యక్తి నగదును తరలిస్తుండగా, పట్టుకుని నారాయణపేట్ గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు పేర్కొన్నారు.

మాగనూర్: మరికల్ మండలం మాదారం గ్రామానికి చెందిన ఉప్పు రాము తన వాహనంలో రూ.లక్ష 40వేలు తరలిస్తుండగా, మాగనూర్‌లో పట్టుకున్నట్లు ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

ఊట్కూర్: పగిడిమారికి చెందిన వెంకటేష్ తన వాహనంలో రూ.లక్ష నగదు తరలిస్తుండగా, మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ గోకారి తెలిపారు.

ప్రత్యేక బ్యాంక్ అకౌంట్ తప్పనిసరి..

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థి నామినేషన్ దాఖలుకు ముందుగా బ్యాంక్ అకౌంట్ తెరువాల్సి ఉంటుంది. నామినేషన్ పత్రం సమర్పించడానికి 24 గంటల ముందే ఎన్నికల ఖర్చుకు సంబంధించి అభ్యర్థి తన పేరిట బ్యాంకు ఖాతా ఓపెన్ చేయాలని రిటర్నింగ్ అధికారి అనిల్‌కుమార్ తెలిపారు. ఇది వరకు తెరచిన వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలు అనుమతించబడవని పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థి ఈ నియోజకవర్గ ఓటరు కానట్లయితే.. అతను ఓటరుగా నమోదైన నియోజకవర్గ ఎన్నికల అధికారి నుంచి ఓటరు జాబితా సర్టిఫైడ్ ప్రతిని తీసుకుని నామినేషన్ పత్రంతో పాటు జతచేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థిని ప్రతిపాదించే వారు నిరక్షరాస్యులై నామినేషన్ పత్రంలో అదివరకే వేలి ముద్రలు వేసినట్లయితే.. తిరిగి ఎన్నికల అధికారి ముందు వేలిముద్రలు వేయాల్సి ఉంటుందని వివరించారు. నామినేషన్ పత్రంలోని ప్రతి కాలాన్ని తప్పనిసరిగా పూరించాలని సూచించారు. ఒకవేళ ఆ కాలంలో రాయాల్సిన సమాచారం లేకపోతే లేదు.. వర్తించదు అని రాయాలే కాని డ్యాష్ (-) అని రాయకూడదన్నారు. నామినేషన్ పత్రంతోపాటు అభ్యర్థి రెండు ఫొటోలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఒక స్టాంపు సైజు ఫొటో నామినేషన్ పత్రంపై అతికించి, మరొక ఫొటోను ఫాం-26 (అఫిడవిట్)పై అతికించాలన్నారు. ఒక్కో అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చన్నారు. నామినేషన్ పత్రాన్ని ఫాం-2 బీ ఎన్నికల అధికారి కార్యాలయంలో ఉచితంగా పొందవచ్చని తెలిపారు. నామినేషన్ పత్రాలతో పాటు రూ.10వేల డిపాజిట్ చెల్లించాలన్నారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన వారైతే రూ.5వేల డిపాజిట్ చెల్లించి, కుల ధ్రువ పత్రం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థి తన నేరచరిత్ర, తనపై నమోదైన పోలీసు కేసులతో పాటు కోర్టు విచారణలో ఉన్న కేసుల వివరాలు, భార్యాపిల్లల స్థిర, చరాస్తులు, అప్పులు బ్యాంకు డిపాజిట్లు, నగదు నిల్వల వివరాలు కూడా సమర్పించాల్సి ఉంటుందని వివరించారు.



రిటర్నింగ్ అధికారి నుంచి ఈ పత్రాలు పొందాలి..

- ఎన్నికల వ్యయాలను నమోదు చేసే రిజిస్టర్లు
- కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు తదితర వాటిని ముద్రించేందుకు ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 127-ఏకు సంబంధించిన సూచనల పుస్తకం.
- చెల్లించిన డిపాజిట్ మొత్తానికి రశీదు
- స్క్రూటినీకి హాజరయ్యేందుకు నోటీసులు
- ప్రతిజ్ఞ లేదా శపథం చేసినట్లు ధ్రువపత్రం
- నామినేషన్ పత్రంలోని లోపాలు, జతపర్చాల్సిన పత్రాల సూచిక

సాక్షి బిజినెస్
శుక్రవారం
3-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	490	64,081
నిఫ్టీ ▲	144	19,133

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	13,260	▲ 199
డోజోన్స్	33,721	▲ 446
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,447	▲ 104
డాక్స్	15,144	▲ 220
షాంఘై	3,009	▲ 14
నికాయ్	31,950	▲ 348

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై		
బంగారం	61,092	▲ 80
బంగారం	60,847	▲ 79
వెండి	71,684	▲ 700

ఫారెక్స్ రేట్లు రూ.లలో			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	•	82.49	84.26
£	బ్రిటన్ పౌండ్	•	99.73	101.94
€	యూరో	•	86.78	89.19
¥	జపాన్ ఎన్ (100)	•	54.27	55.87
AU$	ఆస్ట్రేలియా డాలర్	•	51.63	54.39
S$	సింగపూర్ డాలర్	•	59.12	60.98
SAR	సౌదీ రియాల్	•	21.23	22.86
UAE D	యూఏఈ దిర్హామ్	•	21.87	23.49
¥	చైనా యువాన్	•	10.23	12.29

పోస్ట్ ద్వారా 2,000 నోట్ల మార్పిడి

బ్యాంక్ అకౌంట్లలో డబ్బు జమ



న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రాంతీయ కార్యాలయాలకు దూరంగా ఉండే ప్రజలు తమ వద్ద ఉన్న రూ.2,000 నోట్లు మార్చుకోవడానికి సులభతరమైన విధానం అమలవుతోంది. పోస్ట్ ద్వారా ఈ మేరకు ప్రజలు సేవలు పొందవచ్చని ఇప్పటికే ప్రకటించిన ఆర్‌బీఐ ఉన్నతాధికారులు ఇందుకు వీలైన ప్రక్రియపై ప్రచారాన్ని చేపట్టారు. ఇన్సూర్డ్ పోస్ట్ లేదా టీఎల్ఆర్ (3 అంచెల రక్షణ) కవర్‌ను వినియోగించుకుని సురక్షితమైన మార్గంలో రూ.2,000 నోట్లు మార్చుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఈ విధానంలో పెద్ద నోట్ల మార్పిడికి సంబంధించిన డబ్బు సంబంధిత వినియోగదారు బ్యాంక్ ఖాతాల్లో జమవుతుంది. ''కస్టమర్‌లు రూ. 2,000 నోట్ల మార్పునకు సంబంధించిన డబ్బు తమ ఖాతాలో అత్యంత సురక్షితమైన పద్ధతిలో ప్రత్యక్షంగా క్రెడిట్ కావడానికి వీలుగా ఇన్సూర్డ్ పోస్ట్‌ను వినియోగించుకోవాలని ప్రోత్సహిస్తున్నాము. ఈ విధానం నిర్దేశిత ప్రాంతీయ కార్యాలయాలకు ప్రయాణించడం, వరుసలో నిలబడ్డం వంటి ఇబ్బందుల నుంచి వినియోగదారుని నివారిస్తుంది'' అని ఆర్‌బీఐ రీజినల్ డైరెక్టర్ రోహిత్ పి. దాస్ అన్నారు. చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 97 శాతానికి పైగా తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థకు చేరాయని ఆర్‌బీఐ తెలిపింది. అక్టోబర్ 30వ తేదీ నాటికి రూ.10,000 కోట్ల విలువైన నోట్లు మాత్రమే ప్రజల వద్ద ఉన్నాయని పేర్కొంది. ఈ ఏడాది మే 19న ఆర్‌బీఐ రూ.2,000 డినామినేషన్ నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. దేశంలోని 19 ఆర్‌బీఐ కార్యాలయాల్లో ప్రజలు రూ. 2,000 నోట్లను డిపాజిట్ చేయవచ్చు లేదా మార్చుకోవచ్చు. రూ.2 వేల నోట్ల డిపాజిట్ లేదా మార్పిడి సేవలను బ్యాంకు శాఖలు అక్టోబర్ 7 వరకు అందించాయి. అక్టోబర్ 8 నుంచి ఈ సేవలు 19 ఆర్‌బీఐ కార్యాలయాలకు మారాయి.

కోటక్ ఇన్సూరెన్స్‌లో 'జ్యూరిక్'కు వాటాలు

51% కొనుగోలు; డీల్ విలువ రూ. 4,051 కోట్లు

ముంబై: సాధారణ బీమా సంస్థ కోటక్ జనరల్ ఇన్సూరెన్స్‌లో (కేజీఐ) స్విట్జర్లాండ్‌కు చెందిన జ్యూరిక్ ఇన్సూరెన్స్ 51 శాతం వాటాలు దక్కించుకోనుంది. ఇందుకోసం రూ. 4,051 కోట్లు వెచ్చించనుంది. తదుపరి అదనంగా మూడేళ్లలో అదనంగా 19 శాతం వాటాలు కూడా జ్యూరిక్ ఇన్సూరెన్స్ కొనుగోలు చేయనున్నట్లు కేజీఐ మాతృ సంస్థ కోటక్ మహీంద్రా బ్యాంక్ వెల్లడించింది. వృద్ధి అవకాశాలు పటిష్టంగా ఉన్న కీలక మార్కెట్లలో భారత్ కూడా ఒకటని, కేజీఐ తమకు పటిష్టమైన భాగస్వామి కాగలదని జ్యూరిక్ సీఈవో (ఆసియా పసిఫిక్) తులసి నాయుడు తెలిపారు. తమ కస్టమర్లకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఇరు సంస్థల వనరులు, అనుభవం తోడ్పడగలవని కోటక్ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ దీపక్ గుప్తా పేర్కొన్నారు. ప్రీమియంలపరంగా నాన్-లైఫ్ మార్కెట్‌లో సెప్టెంబర్‌లో కేజీఐకి 0.52 శాతం వాటా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం రూ. 1,148 కోట్ల మేర స్థూల ప్రీమియం సాధించింది. కొత్త పెట్టుబడుల అనంతరం సంస్థ విలువ రూ. 7,943 కోట్లుగా ఉండనుంది.


ఫ్యాషన్ స్టార్టప్స్‌లో అజియో పెట్టుబడులు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 100 డైరెక్ట్ టు కస్టమర్ ఫ్యాషన్ స్టార్టప్స్‌లో పెట్టుబడి పెట్టాలని లైఫ్‌స్టైల్, ఫ్యాషన్ ఈ-కామర్స్ కంపెనీ అజియో భావిస్తోంది. ఈ స్టార్టప్స్ తయారు చేసే, విక్రయించే దుస్తులు, పాదరక్షలు, యాక్సెసరీస్ వంటి ఉత్పత్తులను డైరెక్ట్ టు కన్స్యూమర్ వేదిక అయిన అజియోగ్రామ్‌లో అందుబాటులో ఉంచనుంది. భారతీయ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ విభాగంలోని 200 బ్రాండ్స్‌ను ఎక్స్‌క్లూజివ్‌గా అజియోగ్రామ్‌లో వచ్చే ఏడాదికల్లా చేర్చనున్నట్టు వెల్లడించింది. ఈ బ్రాండ్స్ విస్తరణకు, ఆదాయ వృద్ధికి పూర్తి సహకారం అందించనున్నట్టు అజియో ప్రకటించింది.

దాతృత్వంలో శివ్ నాడార్ టాప్

- రూ. 2,042 కోట్ల విరాళం
- ఎడెల్‌గివ్ హురున్ ఇండియా లిస్టులో అగ్రస్థానం



ముంబై: విరాళాలివ్వడంలో ఐటీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ చీఫ్ శివ్ నాడార్ మరోసారి తన ఉదారత చాటుకున్నారు. 2023లో ఏకంగా రూ. 2,042 కోట్లు విరాళమిచ్చి ఎడెల్‌గివ్ హురున్ ఇండియా 2023 జాబితాలో అగ్రస్థానంలో నిల్చారు. గతేడాది ఇచ్చిన రూ. 1,161 కోట్లతో పోలిస్తే ఇది 76 శాతం అధికం. విప్రో అధినేత అజీమ్ ప్రేమ్‌జీ రూ. 1,774 కోట్లతో (గతేడాదితో పోలిస్తే 267 శాతం అధికం) రెండో స్థానంలోనూ, రూ. 376 కోట్లతో రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఎండీ ముకేశ్ అంబానీ మూడో స్థానంలో ఉన్నారు. అంబానీ విరాళాలు గతేడాదితో పోలిస్తే 8 శాతం తగ్గాయి. ఆదిత్య బిర్లా గ్రూప్ చీఫ్ కుమార మంగళం బిర్లా రూ. 287 కోట్లతో నాలుగో స్థానంలో, అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ రూ. 285 కోట్లతో (50 శాతం అధికం) ఈ జాబితాలో అయిదో స్థానంలో ఉన్నారు. ఇటీవలి హురున్ కుబేరుల జాబితా ప్రకారం అంబానీ సంపద రూ. 8.08 లక్షల కోట్లుగాను, అదానీది రూ. 4.74 లక్షల కోట్లు, నాడార్ సంపద రూ. 2.28 లక్షల కోట్లుగాను ఉంది. సంపద పెరిగే కొద్దీ సంపన్న కుటుంబాలు .. అట్టడుగు వర్గాల వారి కోసం ఆహారం, దుస్తులు, ఉపకార వేతనాలు మొదలైన దాతృత్వ కార్యకలాపాలకు విరాళాలిచ్చే ధోరణి పెరుగుతోందని హురున్ ఇండియా చీఫ్ రీసెర్చర్ అనాస్ రెహ్మాన్ జునైద్ తెలిపారు. లిస్టులో మొత్తం 119 మంది వ్యక్తులు, కుటుంబాలు ఉన్నాయి.

మరిన్ని వివరాలు..

- బజాజ్ కుటుంబంతో పాటు సైరస్ ఎస్ పూనావాలా, అదార్ పూనావాలా, రోహిణి నీలేకని వంటి వారు టాప్ 10లో నిల్చారు. మహిళల్లో నీలేకనితో పాటు అను ఆగా (థర్మాక్స్), లీనా గాంధీ తివారీ (యూఎస్‌వీ) కూడా ఉన్నారు.
- డిస్కౌంటు బ్రోకరేజీ జిరోధా సహ-వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ ఈ జాబితాలో అత్యంత పిన్న వయస్కుడు. కామత్ సోదరులు రూ. 110 కోట్లు విరాళమిచ్చారు.
- రూ. 150 కోట్ల విరాళంతో ఎల్అండ్‌టీ గౌరవ చైర్మన్ ఏఎం నాయక్ .. ప్రొఫెషనల్స్ జాబితాలో అగ్రస్థానంలో, ఓవరాల్ లిస్టులో 11వ స్థానంలో ఉన్నారు.

గెయిల్‌కు బీపీసీఎల్ ముడిసరుకు సరఫరా

రూ. 63,000 కోట్ల ఒప్పందం

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో నెలకొల్పుతున్న పెట్రోకెమికల్ ప్లాంటుకు అవసరమైన ముడిసరుకు కోసం భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్)తో గెయిల్ (ఇండియా) ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ రూ. 63,000 కోట్లు. దీని ప్రకారం 15 ఏళ్ల పాటు గెయిల్‌కు చెందిన ఉసార్ ప్లాంటుకు బీపీసీఎల్ తమ ఎల్‌పీజీ దిగుమతి కేంద్రం నుంచి ఏటా 6 లక్షల టన్నుల ప్రొపేన్ గ్యాస్‌ను సరఫరా చేయనుంది. ఉసార్‌లో 5,00,000 టన్నుల సామర్థ్యంతో గెయిల్ దేశీయంగా తొలి ప్రొపేన్ డీహైడ్రోజినేషన్ (పీడీహెచ్) ప్లాంటును నిర్మిస్తోంది. ఈ ప్లాంటు 2025 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఫర్నిచర్ ఉపకరణాలు, బొమ్మలు మొదలైన వాటిలో ఉపయోగించే పాలీప్రొపిలీన్ తయారీ ప్లాంటుకు ఇది అనుసంధానమై ఉంటుంది.

మార్కెట్‌కు 'ఫెడ్' బూస్ట్!

- ఫెడరల్ రిజర్వ్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వడ్డీ రేట్లు యథాతథం
- కలిసొచ్చిన ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో జోష్
- 490 పాయింట్లు పెరిగి 64 వేల స్థాయి పైకి సెన్సెక్స్
- 144 పాయింట్ల లాభంతో 19,100 పైకి నిఫ్టీ

ముంబై: అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఊహించినట్లే యథాతథంగా ఉంచడంతో పాటు సరళతర ద్రవ్య విధాన అమలు వ్యాఖ్యలు ఈక్విటీ మార్కెట్లలో సానుకూలతలు నింపాయి. దేశీయంగా వాహన విక్రయాలు రికార్డు గరిష్టానికి చేరుకోవడం, జీఎస్‌టీ వసూళ్లు పెరగడం, కార్పొరేట్ క్యూ2 ఆర్థిక ఫలితాలు మెప్పించడం కలిసొచ్చాయి. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 490 పాయింట్లు పెరిగి 64,081 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 144 పాయింట్లు బలపడి 19,133 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం భారీ లాభాల్లో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచి అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు ఆద్యంతం జోరు కనబరిచాయి. ఒక దశలో సెన్సెక్స్ 611 పాయింట్లు దూసుకెళ్లి 64,203 వద్ద, నిఫ్టీ 186 పాయింట్లు బలపడి 19,175 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. రియల్టీ, ప్రభుత్వరంగ బ్యాంకులు, మెటల్, ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా షేర్లకు చిన్న, మధ్య తరహా షేర్లు భారీ డిమాండ్ లభించింది. దీంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు ఒకశాతానికి పైగా ర్యాలీ చేశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,261 కోట్ల షేర్లను అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1380 కోట్ల షేర్లు కొన్నారు. ఫెడ్ రిజర్వ్ నుంచి సానుకూల సంకేతాలు, జపాన్ ప్రభుత్వం 113 బిలియన్ డాలర్ల ఉద్దీపన ప్యాకేజీకి ప్రకటన, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ సైతం వడ్డీరేట్ల జోలికెళ్లకపోవడం తదితర పరిణామాలతో ఆసియా, యూరప్ మార్కెట్లు 1-2% ర్యాలీ చేశాయి. అమెరికా స్టాక్ మార్కెట్లు 1-1.5 శాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి.



- సెన్సెక్స్ ర్యాలీతో బీఎస్ఈలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.3.1 లక్షల కోట్లు పెరిగి రూ. 313.32 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ 30 షేర్లలో టెక్ మహీంద్రా(1%), బజాజ్ ఫైనాన్స్(0.25%) మాత్రమే నష్టపోయాయి.
- క్యూ2 నికర లాభం ఐదు రెట్లు వృద్ధి సాధించడంతో జేకే టైర్ షేరు 10% లాభపడి రూ.337 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 14% ర్యాలీ చేసి రూ.351 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.
- క్యూ2 ఫలితాల ప్రకటన తర్వాత హీరో మోటోకార్ప్ షేరులో లాభాల స్వీకరణ జరిగింది. 1% నష్టపోయి రూ.3050 వద్ద స్థిరపడింది.

లాభాల్లోకి టాటా మోటార్స్

- క్యూ2లో రూ. 3,783 కోట్లు
- జేఎల్ఆర్ అమ్మకాలు జూమ్



న్యూఢిల్లీ: ఆటో రంగ దిగ్గజం టాటా మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) రెండో త్రైమాసికంలో నష్టాలను వీడి లాభాల్లోకి ప్రవేశించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై-సెప్టెంబర్(క్యూ2)లో రూ. 3,783 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది (2022-23) ఇదే కాలంలో రూ. 1,004 కోట్ల నికర నష్టం ప్రకటించింది. బ్రిటిష్ లగ్జరీ కార్ల అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్(జేఎల్ఆర్) పనితీరు లాభాలకు దోహదపడింది. వెరసి వరుసగా నాలుగో త్రైమాసికంలోనూ లాభాలను ప్రకటించగలిగింది. ఆదాయం రూ. 79,611 కోట్ల నుంచి రూ. 1,05,128 కోట్లకు దూసుకెళ్లింది. ఇక స్టాండెలోన్ ప్రాతిపదికన సైతం రూ. 1,270 కోట్ల నికర లాభం సాధించగా.. గతేడాది క్యూ2లో రూ. 293 కోట్ల నికర నష్టం నమోదైంది.

ఇకపై మరింత దూకుడు: తాజా సమీక్షా కాలంలో జేఎల్ఆర్ ఆదాయం 30 శాతం జంప్ చేసి 6.9 బిలియన్ పౌండ్లకు చేరింది. హోల్‌సేల్ అమ్మకాలు, కొత్త ప్రొడక్టులు, వ్యయ నియంత్రణలు, డిమాండుకు అనుగుణమైన పెట్టుబడులు ఇందుకు సహకరించాయి. కాగా.. ఈ ఏడాది ద్వితీయార్ధం(అక్టోబర్-మార్చి)లో హోల్‌సేల్ అమ్మకాలు క్రమంగా జోరందుకోనున్నట్లు కంపెనీ అంచనా వేస్తోంది. నిర్వహణ(ఇబిట్) మార్జిన్లు గత 6 శాతం అంచనాలకంటే అధికంగా 8 శాతాన్ని తాకవచ్చని భావిస్తోంది. ఈ ఏడాది 2 బిలియన్ పౌండ్ల ఫ్రీ క్యాష్‌ఫ్లోను సాధించగలదని ఆశిస్తోంది. వెరసి మార్చికల్లా నికర రుణ భారం బిలియన్ పౌండ్లకంటే దిగువకు చేరవచ్చని అభిప్రాయపడింది.

ఫలితాల నేపథ్యంలో టాటా మోటార్స్ షేరు 1.5% బలపడి రూ. 637 వద్ద ముగిసింది.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ధన్వాద: మండల కేంద్రంలో దుర్గా వైన్స్ సిట్టింగ్ రూంలో గురువారం అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొల్లంపల్లికి చెందిన భాస్కర్‌రెడ్డి ధన్వాడలో రోజు భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. గురువారం ఉదయం వైన్స్ షాపు సిట్టింగ్‌లో మద్యం తాగి అక్కడే మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. కల్తీ మద్యం తాగడం వల్ల చనిపోయాడంటూ గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. ఎక్సైజ్ అధికారులు వైన్స్ షాపులో మద్యాన్ని పరిశీలించాలని మద్యం ప్రియులు కోరారు.

మహిళ ఆత్మహత్య

హన్వాడ: కడుపునొప్పి భరించలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హన్వాడ మండలం కిష్టంపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కిష్టంపల్లికి చెందిన మంగమ్మకు (45) నాలుగైదేళ్లుగా కడుపునొప్పితో బాధపడేది. బుధవారం రాత్రి కడుపునొప్పి రావడంతో భరించలేక పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. మంగమ్మ పరిస్థితి విషమించడంతో గురువారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ రవినాయక్ తెలిపారు. మృతురాలి తల్లి మన్నపురం నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. మృతురాలికి భర్త బచ్చయ్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

లభించని మహిళ ఆచూకీ

పెబ్బేరు రూరల్: జూరాల ప్రధాన కాల్వలో నాలుగు రోజుల కిందట గల్లంతయిన మహిళ ఆచూకీ లభించలేదు. పెబ్బేరు పట్టణానికి చెందిన సకీనాబి (25) జూరాల కాల్వలో బట్టలు ఉతకడానికి వెళ్లి గల్లంతయిన విషయం తెలిసిందే. ఆమె ఆచూకీ లభించకపోవడంతో జూరాల కాల్వకు నీటి విడుదలను నిలుపుదల చేశారు. గురువారం పట్టణానికి చెందిన యువకులు కాల్వలో గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది.



జూరాల కాల్వలో గాలిస్తున్న యువకులు

బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలి

- కలెక్టర్ రవినాయక్



కురుమూర్తి స్వామి ఆలయం వద్ద సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు, జాతర ఉత్సవాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వైభవంగా నిర్వహించాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్ అధికారులకు సూచించారు. గురువారం చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ కురుమూర్తి స్వామి ఆలయ ప్రాంగణంలో బ్రహ్మోత్సవాలు, జాతరపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంతకుముందు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సిబ్బంది కలెక్టర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు తరలి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు.

కంట్రోల్ రూం ఏర్పాటు..

జాతర ప్రాంగణంలో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి 24 గంటలు పనిచేసేలా సిబ్బందిని నియమించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే వెంటనే కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వాలన్నారు. భక్తులకు అవసరమైనన్ని తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానపుగదులు, మూత్రశాలలు ఏర్పాటు చేయాలన్నారు. మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు. సీసీ కెమెరాలు, బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. భక్తులకు ప్రథమ చికిత్సతో పాటు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలని వైద్యసిబ్బందికి సూచించారు. చుట్టుపక్కల గ్రామాల్లో మద్యం విక్రయాలు చేయకుండా చూడాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు ఆదేశించారు. ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకోని పనిచేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాములు, స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్, డీఆర్‌డీఓ యాదయ్య, ఆలయ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, మిషన్ భగీరథ మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల ఎస్ఈలు వెంకటరమణ, జగన్‌మోహన్, ఆర్‌డీఓ అనీల్‌కుమార్, ఈఈలు పుల్లారెడ్డి, మెగారెడ్డి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ, ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి, డీపీఓ వెంకటేశ్వర్లు, ఆలయ ఈఓ మదనేశ్వరెడ్డి, మండల స్పెషల్‌ఆఫీసర్ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

ఆధార్ కోసం క్యూ..

నవాబుపేట: ఆధార్ కార్డులను ఈ-కేవైసీ అప్‌డేట్ కోసం క్యూలే ఆధారమయ్యాయి. ఒకే సారి జనం ఆధార్ కేంద్రాలకు రావటంతో చాలా ఇబ్బంది ఏర్పడింది. దీంతో ఈ-కేవైసీ కోసం జనం ముందుగా ఆధార్ కేంద్రం తెరవకముందే నిరీక్షిస్తున్నారు. మండలానికి ఒకే కేంద్రం ఉండటంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తొందరగా పని చేసుకుపోవాలని ముందుగానే ఆధార్ కేంద్రాలకు వచ్చిన జనం క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడలేక కార్డులను క్యూలో ఉంచి నిరీక్షిస్తున్నారు. గురువారం జనం పెద్ద ఎత్తున్న కార్డులను వరుసలో ఉంచారు.



నవాబుపేటలో ఆధార్ సెంటర్ ఎదుట కార్డుల క్యూ

రైతులపై తేనెటీగల దాడి

- ఒకరు మృతి, మరో నలుగురికి తీవ్రగాయాలు
- మరికల్ మండలం పెద్దచింతకుంటలో విషాదం



వెంకట్‌రెడ్డి (ఫైల్)

మరికల్: వరికోత చేపట్టిన రైతులపై ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. నారాయణపేట జిల్లా మరికల్ మండలం పెద్దచింతకుంటకు చెందిన బద్దిపల్లి వెంకట్‌రెడ్డి (63) గురువారం తన వ్యవసాయ పొలంలో మిషన్‌తో వరికోత చేపట్టగా.. మర్రిచెట్టు కింద ఉన్న పొలంలో మిషన్ బురదలోకి కూరుకుపోయింది. మిషన్‌ను బయటికి తీసుకొచ్చే క్రమంలో డ్రైవర్ ఎక్కువగా రేస్ చేయడం, మిషన్ నుంచి వచ్చిన పొగకు చెట్టుపై ఉన్న తేనెటీగలు లేచి అక్కడే ఉన్న ఐదుగురు రైతులపై దాడి చేశాయి. విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులు వెంటనే అక్కడికి చేరుకుని తేనెటీగల దాడిలో తీవ్రంగా గాయపడిన వెంకట్‌రెడ్డితో పాటు ఆయన కుమారుడు వేణుగోపాల్‌రెడ్డి, బ్రహ్మనందరెడ్డి, అశోక్, నవీన్‌లను అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో వెంకట్‌రెడ్డి మృతి చెందాడు. మిగతా నలుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వెంకట్‌రెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. జిల్లా కేంద్రంలో చికిత్స పొందుతున్న బాధితులను మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ పరామర్శించారు.

యోగా పోటీల్లో ఉమ్మడి జిల్లాకు ద్వితీయ చాంపియన్‌షిప్



యోగా క్రీడాకారులను అభినందిస్తున్న డీఈఓ రవీందర్

మహబూబ్‌నగర్ క్రీడలు: సిద్దిపేటలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ యోగా పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు మెరుగైన ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా యోగా జట్టు ద్వితీయ చాంపియన్‌షిప్ సాధించింది. అండర్-14 ఆర్టిస్టిక్ విభాగం, గ్రూప్‌యోగాలో యోగేశ్వర్ బంగారు పతకం, అండర్-17 విభాగం గ్రూప్ యోగాలో కవిత బంగారు పతకం, ఆర్టిస్టిక్‌లో అరవింద్ వెండి పతకం సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను గురువారం జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్ అభినందించారు. రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో రాణించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలు యాదవ్, ఏఎంఓ డి.శ్రీనివాస్, జడ్చర్ల ఎంఈఓ మంజులాదేవి, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యం



మాట్లాడుతున్న రాయికంటి రాందాస్

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాటాలు నిర్వహిస్తూనే ఉంటామని ఎమ్మార్పీఎస్ (ఆర్ఆర్) రాష్ట్ర అధ్యక్షుడు రాయికంటి రాందాస్ అన్నారు. గురువారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో జిల్లా ఇన్‌చార్జి రాజగాని అశోక్ అధ్యక్షతన మాదిగ సంఘాల ప్రతినిధులతో మాదిగ రాజకీయ చైతన్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయికంటి రాందాస్ మాట్లాడుతూ మాదిగల డిమాండ్లు అంగీకరించే నాయకత్వానికి, గౌరవించే వారికే తమ మద్దతు ఉంటుందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికలకు ముందు వర్గీకరణకు మేము కట్టుబడి ఉన్నామని చెప్పి ఆ తర్వాత అధికారంలోకి వచ్చాక నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నాయని అన్నారు. ఇప్పుడు జరగబోయే ఎన్నికల్లో ఎస్సీ వర్గీకరణపై స్పష్టమైన వైఖరి వ్యక్తం చేసే పార్టీకి మాదిగలు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తారని అన్నారు. సమావేశంలో టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సింగిరెడ్డి పరమేశ్వర్, మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డమీది గోపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జుట్ల హన్మంతు, నాయకులు సాయిబాబా, యాంకి రమేష్, ప్రవీణ్, ఎల్.రమేష్, రాజశేఖర్, తిరుమలయ్య, అనిల్, నగేష్, వినోద్, రాజు, కొండన్న, జీవన్, ధనుంజయ్య, ప్రసాద్, మెట్టు అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు 2,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. గురువారం రాత్రి 8 గంటల వరకు 2,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైనట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు నీటి పంపింగ్ కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, ఆవిరి రూపంలో 119, ఎడమ కాల్వకు 730, కుడి కాల్వకు 731 క్యూసెక్కులతో కలిపి మొత్తం 2,330 క్యూ సెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 6.462 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

నిండుకుండలా రామన్‌పాడు జలాశయం

చిన్నచింతకుంట: మదనాపురం మండలంలోని రామన్‌పాడు జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1.021 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ నుంచి 920, సమాంతర కాల్వ నుంచి 672 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. వ్యవసాయ అవసరాలకోసం ఎన్టీఆర్ కాల్వ ద్వారా 1150, కుడి, ఎడమ కాల్వలకు 20 క్యూసెక్కులు, రాజీవ్ భీమా ఎత్తిపోతల ద్వారా 854 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ సింగిరెడ్డి అనిల్‌రెడ్డి తెలిపారు.

శ్రీశైలంలో 843.4 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో గురువారం 843.4 అడుగుల వద్ద 67.2685 టీఎంసీల నీటి నిల్వ ఉంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 31,784 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. 24 గంటల వ్యవధిలో మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,600, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 980, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకి 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 1.490 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి, 3,127 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. జలాశయంలో 169 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.



నెట్టెంపాడుకు పంపింగ్ అవుతున్న నీరు

V
సాక్షి
ఫ్యామిలీ
మహబూబ్‌నగర్
శుక్రవారం ॥ 3-11-2023

● టెక్.. టాక్



హువావే నోవా 11 ఎస్‌ఈ

సైజ్: 6.67 అంగుళాలు; రిజల్యూషన్: 1080×2400 పిక్సెల్స్
బరువు: 186 గ్రా. బ్యాటరీ: 4500 ఎంఏహెచ్
కలర్స్: గ్రీన్, వైట్, బ్లాక్ ● 5జీ కనెక్టివిటీ రిఫ్రెష్ రేట్: 90 హెచ్‌జడ్

లెనోవా ట్యాబ్ పీ12



సైజ్: 12.7 అంగుళాలు
రిజల్యూషన్: 1840×2944
వోఎస్: ఆండ్రాయిడ్ 13 కలర్స్: స్టోర్మ్ గ్రే, ఓట్
ఇంటర్నల్: 128జీబి 4జీబి ర్యామ్ / 128జీబి 8జీబి ర్యామ్ / 256 జీబి 8జీబి ర్యామ్
బరువు: 615 గ్రా. బ్యాటరీ: 10200 ఎంఏహెచ్


పోట్రానిక్స్ స్క్రీన్ క్లీనర్



బ్రాండ్: పోట్రానిక్స్ కలర్: బ్లూ
మెటీరియల్: ప్లష్ బరువు: 50 గ్రా.
కంపాటబుల్ డివైజెస్: మానిటర్, ట్యాబ్లెట్ స్క్రీన్, స్మార్ట్ ఫోన్స్

గూగుల్ పాస్‌కీస్

ఆండ్రాయిడ్ డివైజ్‌ల కోసం సెర్చ్ ఇంజన్ దిగ్గజం గూగుల్ సరికొత్త క్రెడెన్షియల్ మేనేజర్‌ను తీసుకు రానుంది. 'పాస్ కీస్' ద్వారా ఈ టూల్ మన లాగిన్



అవసరాలకు ఉపయోగపడుతుంది. ఆన్‌లైన్ ఎకౌంట్స్‌లో లాగిన్ కావడానికి ఇదో కొత్త విధానం. దీని ద్వారా యూజర్‌లు పాస్‌వర్డ్ ఉపయోగించకుండానే వెబ్‌సైట్‌లు, అప్లికేషన్‌లలో లాగిన్ కావచ్చు. రైట్ అథంటికేషన్ మెథడ్ ద్వారా క్రెడెన్షియల్ మేనేజర్ 'పాస్‌కీస్' మరో లెవల్‌కు తీసుకువెళ్లనుంది.

ఇన్‌స్టాలో ఇంటర్నెట్ యాక్టివిటీ ట్రాకింగ్ స్టాప్ చేయడానికి...



- ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రొఫైల్ పిక్చర్ టాప్ చేయాలి
- టాప్ రైట్ కార్నర్‌లో ఉన్న మూడు హారిజంటల్ లైన్స్‌ను టాప్ చేయాలి
- సెట్టింగ్ అండ్ ప్రైవసీ-సెలెక్ట్
- ట్యాప్-యాక్టివిటీ
- ట్యాప్-యాక్టివిటీ ఆఫ్ మెటా టెక్నాలజీస్
- ట్యాప్-డిస్‌కనెక్ట్ ఫ్యూచర్ యాక్టివిటీ


అడ్వాన్స్‌డ్ డాటా ఎనాలసిస్



చాట్‌బాట్ కోసం 'అడ్వాన్స్‌డ్ డాటా ఎనాలసిస్' అనే కొత్త ఫీచర్ గురించి ప్రకటించింది ఓపెన్ ఏఐ. దీని ద్వారా యూజర్‌లు పీడీఎఫ్ ఫైల్స్, డాటా ఫైల్స్, ఇతర ఫైల్స్ అప్‌లోడ్, ఎనాలసిస్ చేసుకోవచ్చు. ప్రస్తుతం ఇది బీటా దశలో ఉంది. సుదీర్ఘమైన డాక్యుమెంట్‌ల నుంచి సంక్షిప్త సమాచారం, రకరకాల డాటా పాయింట్స్‌ను అర్థం చేసుకోవడానికి, డాటా ఆధారంగా గ్రాఫ్స్ అండ్ చార్ట్స్ జనరేట్ చేయడానికి ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది.

● సక్సెస్ స్టోరీ

ప్రమోద్ గాడ్గే



'భవిష్యత్ అనేది రకరకాల వస్తువులతో కూడిన బాక్స్‌లాంటిది. మనం తీసినప్పుడు ఏ వస్తువు చేతికందుతుందో తెలియదు. కొన్నిసార్లు నిరాశపరిచే వస్తువు, కొన్నిసార్లు అత్యంత విలువైన వస్తువు చేతికి అందవచ్చు'... ఈ సినిమా డైలాగ్‌ను ప్రమోద్ గాడ్గే, షాహీద్ మెమన్‌లు విన్నారో లేదో తెలియదుగానీ 'అన్‌బాక్స్' రూపంలో వారికి బాక్స్ నుంచి విలువైన కానుక లభించింది. తమ భవిష్యత్‌నే మార్చేసిన స్టార్టప్ కానుక అది.
లాజిస్టిక్ ఆటోమేషన్ స్టార్టప్ 'అన్‌బాక్స్ రోబోటిక్స్'తో అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకున్నారు ప్రమోద్, షాహీద్‌లు...

షాహీద్ మెమన్



అన్‌బాక్స్

అదరగొట్టారు

'మన దేశంలో ఇ-కామర్స్ వేగం పెరిగింది' అనే వార్త చదివి 'ఓహో అలాగా!' అనుకోవచ్చు. అద్భుతమైన 'ఐడియా' కూడా రావచ్చు. ఆ ఐడియా జీవితాన్నే మార్చేయవచ్చు. ప్రమోద్ గాడ్గే, షాహీద్ మెమన్‌ల విషయంలో జరిగింది ఇదే. మన దేశంలో ఇ-కామర్స్ స్పీడ్‌ను గమనించిన వీరు సప్లై చైన్ రోబోటిక్స్ స్టార్టప్ 'అన్‌బాక్స్ రొబోటిక్స్'తో విజయపథంలో దూసుకుపోతున్నారు. ఇండియా దాటి యూఎస్, యూరప్ మార్కెట్‌లోకి కూడా అడుగు పెట్టనున్నారు.

పుణే కేంద్రంగా మొదలైన 'అన్‌బాక్స్ రోబోటిక్స్' సప్లై చైన్ ఆటోమేషన్ సోల్యూషన్స్‌లో మార్పు తీసుకువచ్చింది. వినూత్న ఏఐ-ఆధారిత కంట్రోల్ సిస్టమ్ ద్వారా రోబోట్‌ల ఉత్పాదకతను పెంచింది. పనితీరును మార్చింది.

'మానవ శక్తి నుంచి రోబోట్స్ వరకు ప్యాకేజీలను క్రమబద్ధీకరించడం, రవాణా చేయడం... మొదలైన విధానాలు మన దేశంలో ఇ-కామర్స్ వేగాన్ని అందుకోలేకపోతున్నాయేమో అనిపించింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని మొబైల్ రోబోటిక్స్ సిస్టమ్‌ను నిర్మించాలనుకున్నాం. లాజిస్టిక్స్, రిటైల్ ప్లేయర్‌ల కోసం ప్యాకేజీ సార్టింగ్, ఆర్డర్ కన్సాలిడేషన్ ప్రక్రియలను ఆటోమేట్ చేయడానికి శక్తిమంతమైన రోబోటిక్స్ వ్యవస్థను నిర్మించాలనుకున్నాం' గతాన్ని గుర్తు తెచ్చుకుంటాడు 'అన్‌బాక్స్ రోబోటిక్స్' సీయివో ప్రమోద్ గాడ్గే.

'అన్‌బాక్స్ రోబోటిక్స్'కు ముందు ఫ్లిప్‌కార్ట్‌లో సార్టింగ్‌కు సంబంధించి ఆటోమేషన్ విభాగంలో, మన దేశంలోని తొలి రోబోట్-బేస్డ్ సార్టింగ్ ప్రాజెక్ట్‌లో పనిచేశాడు ప్రమోద్.

'అన్‌బాక్స్ రోబోటిక్స్' కో-ఫౌండర్, సీటీవో షాహీద్ రోబోటిక్స్, ఇంటెలిజెన్స్ సిస్టమ్స్, స్వోర్మ్ ఇంటెలిజెన్స్‌లో మంచి అనుభవం ఉంది. రోబోటిక్స్, ఆటోమేషన్ ఫీల్డ్స్‌లో సీటీవోగా పనిచేశాడు.

'అన్‌బాక్స్'కు ముందు 'వనోర రోబోట్స్' అనే స్టార్టప్ ప్రారంభించాడు.

చిత్తశుద్ధి, కష్టపడే తత్వం, అంకితభావం లేకపోతే పేపర్ మీద రాసుకున్న కాన్సెప్ట్ అక్కడే నిలిచిపోతుంది. అయితే ఈ ఇద్దరు మిత్రులు వారి బృందం బాగా కష్టపడి 'అన్‌బాక్స్'ను సూపర్ హిట్ చేశారు.

> స్టార్టప్ కాన్సెప్ట్‌లో సత్తా ఉంటే ఇన్వెస్టర్‌లు వెనకడుగు వేయరు. 'అన్‌బాక్స్' విషయంలోనూ అదే జరిగింది.



స్టార్టప్ కాన్సెప్ట్‌లో సత్తా ఉంటే ఇన్వెస్టర్‌లు వెనకడుగు వేయరు. 'అన్‌బాక్స్' విషయంలోనూ అదే జరిగింది. టీమ్‌ను విస్తరించడానికి, అంతర్జాతీయ స్థాయిలో కస్టమర్‌ల డిమాండ్‌ను నెరవేర్చడానికి, రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌పై సమీకరించిన నిధులను వాడారు.

2021లో థర్డ్-పార్టీ లాజిస్టిక్స్, ఇ-కామర్స్ ప్లేయర్స్‌తో కంపెనీ బీటా పైలట్స్ లాంచ్ చేసినప్పుడే లీడింగ్ ఇ-కామర్స్ లాజిస్టిక్స్ కంపెనీల నుంచి ఆర్డర్లు రావడం మొదలైంది. ఇది భవిష్యత్ విజయానికి సూచికలా పనిచేసింది. ఇన్వెస్టర్‌లలో మరింత నమ్మకాన్ని నింపింది.

'అన్‌బాక్స్' స్టార్టప్ ఇ-కామర్స్, లాజిస్టిక్స్, రిటైల్‌లాంటి సెక్టార్‌లలో ఏడు పెద్ద సంస్థలతో కలిసి పనిచేస్తోంది. క్లయింట్ సబ్‌స్క్రిప్షన్ మోడల్ 'రోబోట్ యాజ్ ఏ సర్వీస్'ను కూడా కంపెనీ ప్రారంభించింది.

ఇ-కామర్స్, లాజిస్టిక్స్, రిటైల్ రంగాలకు సంబంధించి రోబోటిక్-బేస్డ్ ఫుల్‌ఫిల్‌మెంట్, డిస్ట్రిబ్యూషన్ టెక్నాలజీలో ప్రత్యేకత సాధించిన 'అన్‌బాక్స్ రోబోటిక్స్' అంతర్జాతీయ స్థాయిలోనూ సత్తా చాటుతుంది.

యువర్స్

● ఇంగ్లిష్ ఇడియమ్స్



ఏ హెడ్‌స్టార్ట్

ఏదైనా విషయంలో, పోటీలో, పరీక్షలో....ఒక వ్యక్తికి అడ్వాంటేజ్ ఉంటే వాడే మాట... ఏ హెడ్‌స్టార్ట్.
ఉదా: మెర్లిన్స్ బ్యూటీ అండ్ నేచురల్ గ్రేస్ గేవ్ హర్ ఏ బిగ్ హెడ్‌స్టార్ట్ ఇన్ ది మోడలింగ్ అండ్ యాక్టింగ్

పాసింగ్ ది బక్

ఒక పనిలో తన రెస్పాన్సిబిలిటీని తప్పించుకోవడంలో భాగంగా నెపాన్ని ఇతరుల మీద నెట్టి బ్లేమ్ చేసే సందర్భంలో వాడే మాట...పాసింగ్ ది బక్.
ఉదా: డోన్ట్ ట్రై టు పాస్ ది బక్- దిస్ ఈజ్ యువర్ రెస్పాన్సిబిలిటీ, నాట్ మైన్.

● మ్యూజిక్ వరల్డ్

సంగీతమే శ్వాసగా...

కోల్‌కతాకు చెందిన సింగర్, సాంగ్ రైటర్ అమిక శైల్. తొమ్మిది సంవత్సరాల వయసులో 'లిటిల్ చాంప్స్' రియాలిటీ షోలో పాల్గొంది. ఫోక్, జాజ్, క్లాసిక్‌లో 'వావ్' అనిపించుకుంది. డిగ్రీ పూర్తయిన తరువాత తన కలను సాకారం చేసుకోవడానికి ముంబైకి వచ్చింది. 'స్ట్రగుల్' అంటే ఏమిటో అప్పుడే తెలిసింది. సినిమాల్లో పాడడానికి చేసే ప్రయత్నాలు విఫలం అవుతున్నాయి. హిందుస్థానీ క్లాసిక్ మ్యూజిక్‌లో అమికకు మంచి పట్టు ఉంది. అవకాశాలు వచ్చే వరకు ఖాళీగా కూర్చోవడం ఎందుకని మ్యూజిక్ టీచర్‌గా జాబ్‌లో చేరింది. ఎట్టకేలకు 'వెడ్డింగ్ యానివర్సరీ' సినిమాతో బ్రేక్ వచ్చింది. ఎన్నో టీవీ సీరియల్స్‌కు టైటిల్ సాంగ్స్ పాడింది. ఎన్నో రియాల్టీ షోలలో పాల్గొంది.

'సంగీతం అనేది నాకు అభిరుచి కాదు శ్వాస లాంటిది. సంగీత సాధనకు ఎన్ని గంటలైనా సరిపోవు. యాంత్రికంగా, మొక్కుబడిగా కాకుండా ప్రశాంత చిత్తంతో సంగీత సాధన చేయాలి' అంటున్న అమిక నటిగా కూడా రాణిస్తోంది. 'పవర్‌ఫుల్ డైలాగులో చెప్పడంలో.


అమిక శైల్

సరియైన భావోద్వేగాలు ప్రదర్శించడంలో నాలోని సింగర్ గురువులా మార్గదర్శనం చేస్తోంది' అంటుంది అమిక శైల్.


అమిక శైల్

● గేమింగ్



అగ్గిబరాట

అడ్వెంచర్ వీడియో గేమ్ 'థ్రస్టీ సూటర్స్' విడుదల అయింది. యంగ్ లేడీ జాల తన సోదరి వివాహం సందర్భంగా స్వస్థలానికి వస్తుంది. ఆ తరువాత ఏమైంది అనేది ఈ గేమ్. సంస్కృతి, భావోద్వేగాలు, కుటుంబ ఒత్తిళ్లు, బంధాలకు ఈ గేమ్ కేంద్రబిందువు. సినిమాటిక్, టర్న్-బేస్‌డ్ బ్యాటిల్ సీక్వెన్స్‌లు ఉంటాయి.

గేమ్ ప్లే: కంబాట్, స్కేట్ బోర్డింగ్, కుకింగ్
జానర్స్: రోల్-ప్లేయింగ్ గేమ్, అడ్వెంచర్ గేమ్, యాక్షన్ గేమ్, అడ్వెంచర్
ప్లాట్‌ఫామ్స్: ప్లే స్టేషన్ 5, నిన్‌టెండో స్విచ్, ఎక్స్ బాక్స్ వన్, ప్లే స్టేషన్ 4, మైక్రోసాఫ్ట్ విండోస్, ఎక్స్ బాక్స్ సిరీస్ ఎక్స్, సిరీస్ ఎస్

సినిమా


● రామ్‌చరణ్

ఆస్కార్ యాక్టర్స్ బ్రాంచ్‌లో...

రామ్ చరణ్‌కి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. 'ది అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' (ఆస్కార్ కమిటీ) తాజాగా వెల్లడించిన 'మెంబర్ క్లాస్ ఆఫ్ యాక్టర్స్' జాబితాలో రామ్‌చరణ్‌కి సభ్యత్వం దక్కింది. 'ఆర్ఆర్ఆర్'లో రామరాజు పాత్రలో అద్భుతంగా నటించినందుకుగాను చరణ్‌కి ఈ స్థానం లభించింది. కాగా 'ది అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' ఆ మధ్య విడుదల చేసిన యాక్టర్స్ బ్రాంచ్‌లో తెలుగు నుంచి ఎన్టీఆర్‌కి చోటు దక్కిన విషయం తెలిసిందే. తాజాగా రామ్‌చరణ్‌తో పాటు మరికొందరు హాలీవుడ్ నటీనటులకు ఈ కమిటీలో చోటు దక్కింది. ''ఈ నటులు వెండితెరపై తమ ప్రతిభతో ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల హృదయాల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించారు. వాస్తవానికి, కల్పితానికి మధ్య వారధులుగా నిలిచారు. ఎన్నో సినిమాల్లో వారి నటనతో పాత్రలకు ప్రాణం పోశారు. వారి కళతో సాధారణ సినిమాతో ప్రేక్షకులకు అసాధారణ అనుభవాలను అందిస్తున్నారు. అలాంటి వారిని 'యాక్టర్స్ బ్రాంచ్'లోకి ఆహ్వానిస్తున్నాం'' అని సోషల్ మీడియా వేదికగా ఆస్కార్ అకాడమీ ప్రతినిధులు షేర్ చేశారు. కాగా 96వ ఆస్కార్ అవార్డుల వేడుక వచ్చే ఏడాది మార్చిలో జరగనుంది.

చేయి పోయినా ఆత్మవిశ్వాసంతో సినిమా పూర్తి చేశాను

- సెబాస్టియన్ నోవా అకోస్టా

రక్షిత్ అట్లూరి హీరోగా నటించిన తాజా చిత్రం 'నరకాసుర'. సెబాస్టియన్ నోవా అకోస్టా జూనియర్ దర్శకత్వంలో డా.అజ్జా శ్రీనివాస్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో సెబాస్టియన్ నోవా మాట్లాడుతూ– ''దర్శకుడు కావాలనేది నా కల. ఓ ఫిల్మ్ స్కూల్‌లో శిక్షణ తీసుకుని అవకాశాల కోసం ప్రయత్నించినా కుదర్లేదు. టెక్నాలజీపై అవగాహన కోసం 2012లో ప్రసాద్ ల్యాబ్‌లో చేరాను. అక్కడ రిలీజ్‌కు నోచుకోని సినిమాలు కనిపించాయి. దీంతో సినిమా తీయడం కాదు.. తీసిన సినిమాను మార్కెట్ చేసుకోవడం ముఖ్యమని భావించి సాయి కొర్రపాటిగారి సహాయంతో డిస్ట్రిబ్యూషన్ రంగంలో చేరాను. ఆ తర్వాత నా దర్శకత్వంలో సినిమా కోసం కథ రెడీ చేసుకున్నాను. చిన్నతనంలో నేను తప్పిపోతే ట్రాన్స్‌జెండర్స్ నన్ను మా కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ కథకు ఈ సంఘటన ఓ స్ఫూర్తి. ఇక దర్శకుడిగా తొలి అవకాశమే కష్టం అనుకుంటే.. 'నరకాసుర' చిత్రీకరణ టైమ్‌లో ఒరిస్సాలో షూటింగ్ పూర్తి చేసుకుని జబల్‌పూర్ వెళ్తుంటే ప్రమాదం జరిగి, నా చేయి పోయింది. ప్రమాదం జరిగిన తర్వాత 27వ రోజు నేను సెట్స్‌లోకి వచ్చి, ఆత్మవిశ్వాసంతో సినిమాను పూర్తి చేశాను. ఇక మాధవన్, అరుణ్ విజయ్, వివేక్ ఒబెరాయ్, టొవినో థామస్ వంటి స్టార్స్‌తో ట్రైబల్ నేపథ్యంలో ఓ సినిమా ప్లానింగ్‌లో ఉంది. మూడు భాషల్లో చిత్రీకరిస్తాం'' అన్నారు.



మా వ్యూహం మాకుంది

- రామ్‌గోపాల్ వర్మ


● కిరణ్‌కుమార్, రామ్‌గోపాల్ వర్మ

''అరచేతిని అడ్డుపెట్టి సూర్య కాంతిని ఆపలేరు. అలాగే మా 'వ్యూహం' సినిమా విడుదలను కూడా ఆపలేరు. ఈలోగా మా సినిమాపై ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేయకుండా నేనే ముందుకొచ్చి మాట్లాడుతున్నా. ఒకవేళ మా చిత్రం రిలీజ్‌కి అడ్డంకులు సృష్టిస్తే ఏం చేయాలో మా వ్యూహం మాకుంది'' అని డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ అన్నారు. అజ్మల్, మానస ప్రధాన పాత్రల్లో రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'వ్యూహం'. దాసరి కిరణ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా తొలి భాగం ఈ నెల 10న విడుదల కావాల్సి ఉంది. అయితే రిలీజ్‌ని వాయిదా వేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ–''వ్యూహం' చూసిన సెన్సార్ సభ్యులు రివైజింగ్ కమిటీకి పంపిస్తున్నట్లు సమాచారం ఇచ్చారు. ఎందుకు రివైజింగ్ కమిటీకి పంపిస్తున్నారో కారణాలు చెప్పలేదు. దీంతో ప్రస్తుతానికి సినిమా విడుదల వాయిదా వేస్తున్నాం. రివైజింగ్ కమిటీల్లోనూ తేల్చకుంటే 'ఉడ్తా పంజాబ్, పద్మావత్' వంటి హిందీ సినిమాలకు కోర్టు ద్వారా రిలీజ్ ఆర్డర్ తెచ్చుకున్నట్లే మేమూ తెచ్చుకుంటాం. చట్టపరంగా ఉన్న పద్ధతుల ద్వారా 'వ్యూహం'ను రిలీజ్ చేసుకుంటాం. ఈ సినిమా విడుదల ఆపాలని నారా లోకేశ్ సెన్సార్‌కు లేఖ రాసినట్లు తెలిసింది. అయితే అదెంత నిజమో చెప్పడానికి నా దగ్గర ఆధారాలు లేవు. మీడియా, సోషల్ మీడియాలో ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలు చెప్పినట్లే 'వ్యూహం' ద్వారా నా అభిప్రాయాలు చెప్పాను. అది ఎవరైనా వింటారా? లేదా అన్నది అర్థం లేని ప్రశ్న. సినిమా ఇవ్వడం వరకే నా బాధ్యత'' అన్నారు. ''మా సినిమాను రివైజింగ్ కమిటీకి పంపినా నష్టం జరగదు. మేము అనుకున్నట్లే అన్నీ సకాలంలో జరుగుతాయని ఆశిస్తున్నాం. కొత్త రిలీజ్ డేట్‌ను త్వరలోనే ప్రకటిస్తాం''అన్నారు దాసరి కిరణ్ కుమార్.



హీరో వరుణ్ తేజ్, హీరోయిన్ లావణ్యా త్రిపాఠిల వివాహం ఇటలీలోని టస్కనీలో బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ వివాహానికి మెగా, అల్లు కుటుంబ సభ్యులతో పాటు అత్యంత సన్నిహితులు, స్నేహితులు హాజరయ్యారు. హీరో అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి, కుమారుడు అల్లు అయాన్, కుమార్తె అల్లు అర్హతో కలిసి వివాహానికి హాజరై వధూవరులకు అభినందనలు తెలిపారు.

లవ్ డ్యూయెట్

ఆనంద్ దేవరకొండ, రితికా నాయక్ జంటగా నటించనున్న సినిమాకు 'డ్యూయెట్' టైటిల్‌ను ఖరారు చేశారు. ఏఆర్ మురుగదాస్ దగ్గర అసిస్టెంట్‌గా చేసిన మిథున్ వరద రాజ కృష్ణన్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ, స్టూడియో గ్రీన్ పతాకంపై కేజీ జ్ఞానవేల్ రాజా ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవం గురువారం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి ఆనంద్ తల్లిదండ్రులు గోవర్ధన్ దేవరకొండ, మాధవి కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో హీరోయిన్లపై దర్శకుడు హరీష్ శంకర్ క్లాప్ ఇచ్చారు. తొలి సీన్‌కి దర్శకుడు చందు మొండేటి గౌరవ దర్శకత్వం వహించగా, దర్శక-నిర్మాత సాయిరాజేష్, నిర్మాత జ్ఞానవేల్ రాజా, ఈ చిత్ర సహ-నిర్మాత 'మధుర' శ్రీధర్ స్క్రిప్ట్‌ను దర్శకుడు మిథున్‌కు అందజేశారు. ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ– ''డ్యూయెట్' నాకు స్పెషల్ ఫిల్మ్. మిథున్ మంచి కథ రాశాడు'' అన్నారు. ''ఇదొక మంచి లవ్‌స్టోరీ'' అన్నారు మిథున్. ''ఈ కథ విన్నప్పుడు భావోద్వేగానికి లోనయ్యాను. జీవీ ప్రకాశ్‌కుమార్ ఆల్రెడీ రెండు పాటలు ఇచ్చేశారు. వారం రోజుల్లో తొలి షెడ్యూల్ ఆరంభిస్తాం'' అన్నారు. ఈ వేడుకకు హీరోలు విజయ్ దేవరకొండ, సత్యదేవ్ అతిథులుగా హాజరయ్యారు.


● రితిక, ఆనంద్ దేవరకొండ

ఈ సినిమా నాకో పెద్ద వేడుక

- 'సత్యం' రాజేశ్



'సత్యం' రాజేష్, కామాక్షీ భాస్కర్ల ప్రధాన తారాగణంగా, రాకేందు మౌళి, బాలాదిత్య, కరుణకుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. 2021లో వీక్షకుల ముందుకు వచ్చిన 'మా ఊరి పొలిమేర'కు ఇది సీక్వెల్ చిత్రం. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రాన్ని పంపిణీదారుడు వంశీ నందిపాటి నేడు విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో 'సత్యం' రాజేశ్ మాట్లాడుతూ– ''మా ఊరి పొలిమేర'కు వీక్షకుల నుంచి వచ్చిన స్పందనను బట్టి 'మా ఊరి పొలిమేర 2' చేద్దామని అనుకున్నాం. తొలి భాగం ముగిసిన దగ్గర్నుంచే మలి భాగం ఆరంభమవుతుంది. కొమరయ్య (సినిమాలో 'సత్యం' రాజేశ్ పాత్ర) గురించి నిజాలు తెలుసుకున్న లక్ష్మి (కామాక్షీ పాత్ర) ఏం చేసింది? ఏ విధంగా పగ తీర్చుకోవాలనుకుంది? కవిత ఎలా జీవించి ఉంది? ఇలాంటి ఆసక్తికరమైన కథనంతో మంచి ట్విస్ట్‌లతో సాగుతుంది. నా కెరీర్‌లో ఓ పెద్ద వేడుకలా ఈ సినిమాను భావిస్తున్నాను. ప్రస్తుతం 'గీతాంజలి' సీక్వెల్, వరుణ్‌తేజ్ 'మట్కా' వంటి సినిమాల్లో కీలక పాత్రలు చేస్తున్నాను. హీరోగా 'టెనెంట్' చేస్తున్నాను'' అని చెప్పుకొచ్చారు.

"చేసిన పాత్రలనే మళ్లీ చేస్తే నాకు బోరింగ్‌గా అనిపిస్తుంటుంది. ఎప్పటికప్పుడు వినూత్నంగా, ప్రయోగాత్మకంగా సినిమాలు చేసే కార్తీనే ప్రేక్షకులు కూడా ఇష్టపడుతున్నారు. అంటే నేను నాలా ఉంటే ఆదరిస్తున్నారు. మరొకరిలా ఉండాలనుకోవడం లేదు. కాబట్టి నా తరహా సినిమాలే నేను చేస్తాను" అని కార్తీ అన్నారు. కార్తీ హీరోగా 'జోకర్' ఫేమ్ రాజు మురుగన్ దర్శకత్వంలో ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన 'జపాన్' చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. తెలుగు వెర్షన్‌ను అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో కార్తీ చెప్పిన విశేషాలు.



అలాంటి కార్తీనే ఇష్టపడుతున్నారు!

- హీరో కార్తీ

● 'జపాన్' క్యారెక్టర్ బేస్డ్ ఫిల్మ్. నిజమైన కథ కాదు. కొన్ని వాస్తవ ఘటనల స్ఫూర్తితో ఈ సినిమాను రూపొందించాం. ఈ సినిమా కేవలం వినోదం ఇవ్వడం మాత్రమే కాదు... మన ఉనికిని, అస్థిత్వాన్ని ప్రశ్నించేలా కూడా ఉంటుంది. ప్రస్తుత సమాజాన్ని ప్రతిబింబించేలా ఉంటుంది. సోషల్ మీడియా అంశాన్ని కూడా టచ్ చేశాం. అలాగే మనకు 'జపాన్' అంటే హిరోషిమా, నాగసాకిలపై అణుబాంబు దాడి గుర్తుకు రావచ్చు. ఆ దాడి తర్వాత జపాన్ దేశం మళ్లీ పుంజుకుని అత్యున్నత స్థాయికి ఎదిగింది. ఈ రిఫరెన్స్ 'జపాన్' పాత్రలో కూడా కనిపిస్తుంది. ● చాలా కాలం తర్వాత మాస్‌తో కూడిన స్ట్రాంగ్ అండ్ సెటైరికల్ రోల్ నాకు మళ్లీ 'జపాన్'తో వచ్చినట్లు అనిపించింది. 'జపాన్' గ్రే క్యారెక్టర్ కాదు.. డార్క్ అంతే. నా క్యారెక్టర్‌లో డార్క్ హ్యూమర్ ఉంటుంది. 'జపాన్' కోసం రెగ్యులర్ కార్తీలా ఉండకూడదని అనుకున్నాను. దర్శకుడు కూడా ఇదే కోరుకున్నారు. ఈ సినిమా కోసం కొత్తగా మేకోవర్ అయ్యాను. నా వాయిస్ మాడ్యులేషన్, హెయిర్ స్టయిల్ అన్నీ కొత్తగా అనిపిస్తాయి. ● నేను నటించిన 'ఊపిరి' సినిమా తమిళ వెర్షన్‌కు దర్శకులు రాజు ముగరున్ డైలాగ్స్ రాశారు. ఆయనలో మంచి హ్యూమర్ ఉందని ఆ సమయంలో అనిపించింది. కానీ రాజుగారు తీసిన 'కుకు', 'జోకర్' సినిమాల్లో ఇది అంతగా లేదు. సాధారణంగా నేను నా కోసం ఏవైనా కథలు ఉన్నాయా? అని ఎవర్నీ అడగలేదు. తొలిసారి రాజు మురుగన్‌ని అడిగాను. ఓ డార్క్ ఎమోషనల్ స్టోరీ చెప్పారు. నాకు అంతగా నచ్చలేదు. ఆ తర్వాత మరో కథలోని ఓ క్యారెక్టర్ నచ్చి, ఆ పాత్ర ఆధారంగా కథ రాయమన్నాను. అలా 'జపాన్' కథ మొదలైంది. రాజు మురుగన్‌గారు గతంలో జర్నలిస్ట్‌గా చేశారు. ఆయన తన జీవితంలో చూసిన కొన్ని ఘటనలను 'జపాన్'లో చూపించే ప్రయత్నం చేశారు. అలాగే నాగార్జునగారి అన్నపూర్ణ స్టూడియోస్‌తో అసోషియేట్ అవ్వడం ఆనందంగా ఉంది. ● దర్శకుడు నలన్‌కుమార్‌తో నేను చేస్తున్న సినిమా 70 శాతం షూటింగ్ పూర్తయింది. '96' ఫేమ్ ప్రేమ్‌కుమార్‌తో ఓ సినిమా చేయనున్నాను. అలాగే 'ఖైదీ 2', 'సర్దార్ 2' చిత్రాలు చేయాల్సి ఉంది.

ఓ కల ఆధారంగా..


● రోహిత్ నందా

రోహిత్ నందా, ఆనంది జంటగా శ్రీకాంత్ రంగనాథన్, శ్రీనాథ్ రంగనాథన్ ద్వయం దర్శకత్వం వహించిన చిత్రం 'విధి'. ఎస్. రంజిత్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో రోహిత్ నందా మాట్లాడుతూ– ''న్యూజిల్యాండ్‌లో చదువుకున్నాను. నటనపై ఆసక్తితో స్టేజ్ డ్రామాల్లో చేశాను. చిరంజీవిగారి స్ఫూర్తితో ఇండస్ట్రీకి వచ్చాను. ఇక 'విధి' సినిమా రా అండ్ రస్టిక్ ఫిల్మ్. రియల్ లైఫ్‌లోని నా క్యారెక్టర్‌కు విభిన్నమైన పాత్రను ఈ సినిమాలో చేశాను. అలాగే మా 'విధి' సినిమాను చూపులేనివారు కూడా ఓ యాప్ సాయంతో ఆస్వాదించవచ్చు. ఈ ఆలోచన నాదే. కొన్ని కొత్త కథలు వింటున్నాను'' అన్నారు. ''మా కుటుంబ సభ్యుల్లో ఒకరికి వచ్చిన ఓ కల ఆధారంగా 'విధి' సినిమా స్టోరీ లైన్‌ను డెవలప్ చేసి, కథ రెడీ చేసుకున్నాం. రోహిత్ బాగా చేశారు'' అన్నారు శ్రీనాథ్, శ్రీకాంత్.

ఫ్యాషన్









ఉంగరాల గొలుసులు

వేళ్లకి ఉంగరాలు, మెడలో గొలుసులు ధరించడం సాధారణమే! చేతులకు ఉంగరాలు.. చెయిన్లు, హ్యాండ్ కఫ్స్ ధరించడం ఇప్పుడు ట్రెండ్. ఇండోవెస్ట్రన్, వెస్ట్రన్ డ్రెస్సుల మీదకు ఈ ఉంగరాలు, చెయిన్ల వరసలు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి. యువత వేగానికి, స్టయిల్‌కి అద్దంలా భాసిల్లుతున్నాయి.

బంగారు వరసలు

లైట్ వెయిట్ జ్యువెలరీలో భాగంగా హ్యాండ్ కఫ్స్, చెయిన్స్ డిజైనర్లను ఆధునికత వైపుగా పరుగులు తీయిస్తున్నాయి. ఆభరణాల డిజైనర్లు బంగారు లోహంతో వెస్ట్రన్ స్టైల్ డిజైన్స్‌ను కొత్తగా మెరిపిస్తున్నారు.

వెండి వెలుగులు

తక్కువ ఖర్చు అనే జాబితాను ఈ తరం పక్కన పెట్టేస్తోంది. ఏ డిజైన్ తమకు మరింత అందాన్ని తీసుకువస్తుందో, నలుగురిలో గుర్తింపును సంపాదిస్తుందో దానినే ఇష్టపడుతోంది. అందుకే సిల్వర్ డిజైన్స్ మరింతగా యువత మదిని గెలుచుకుంటున్నాయి.

స్టీల్ మెరుపులు

స్ట్రీట్ అండ్ బోహో స్టైల్‌లో స్టీల్‌తో తయారైన ఆభరణాలను యువత ఎక్కువ ధరిస్తుంటుంది. క్యాజువల్ వేర్, పార్టీవేర్‌కీ నప్పే ఈ డిజైన్ వరసలు వందల రూపాయల నుంచి మార్కెట్‌లో లభిస్తున్నాయి.

బ్యూటిప్స్

వేకువ జాముకు చలి తొంగి చూస్తోంది. కిటికీలో నుంచి దొంగలా గదిలో దూరుతోంది. చల్లగా ఒంటికి హాయినిస్తుంది. కానీ చర్మాన్ని పెళుసుబారుస్తుంది కూడా. అందుకే ఆలస్యంగా చర్మసంరక్షణ మొదలవ్వాలి.

శీతాకాలానికి స్వాగతం

- రాత్రి పడుకునే ముందు ముఖాన్ని శుభ్రంగా కడిగి ఆరిన తర్వాత బాదం నూనె లేదా ఆలివ్ ఆయిల్ రాయాలి.
- గోరువెచ్చటి నీటిని దోసిట్లోకి తీసుకుని ముఖాన్ని నీటిలో మునిగేటట్లు ఉంచాలి. ఇది హాట్‌థెరపీ. రోజుకొకసారి ఉదయం స్నానం చేయడానికి ముందు కానీ రాత్రి పడుకునే ముందుకానీ చేయవచ్చు.
- ఒక కోడిగుడ్డు సొనలో, టీ స్పూన్ కమలారసం, టీ స్పూన్ ఆలివ్ ఆయిల్, నాలుగైదు చుక్కల పన్నీరు, అంతే మోతాదులో నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించి పదిహేను నిమిషాల తర్వాత కడిగేయాలి. ఇది పొడిచర్మానికి వేయాల్సిన ప్యాక్.
- బాగా మగ్గిన అరటిపండును మెత్తగా చిదిమి ముఖానికి, మెడకు పట్టించి పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో ముఖాన్ని కడగాలి. ఇది పొడిచర్మానికి మాయిశ్చరైజర్‌గా పని చేస్తుంది, మెడ నలుపు కూడా వదులుతుంది.



- పొడిచర్మాన్ని మృదువుగా మార్చడంలో గ్రేప్‌సీడ్ ఆయిల్ బాగా పని చేస్తుంది. ఆయిల్‌ను ఒంటికి రాసి మర్దన చేయాలి.
- ఫేస్‌ప్యాక్‌లకు బదులుగా స్వచ్ఛమైన ఆముదం ఒంటికి రాసి మర్దన చేసుకోవాలి. ఆముదం వల్ల చర్మం మృదువుగా మారడంతో పాటు అనేక చర్మ సమస్యలు కూడా తగ్గుతాయి.

పారా హుషార్

ఇలాంటి వాళ్లకి ఎలా బుద్ధి చెప్పాలి?

బెంగళూరులోని ప్రముఖ మాల్. ఒక పెద్దమనిషి చాలా సేపుగా దేనికో కాచుకుని ఉన్నాడు. ఒక మహిళను గమనించాడు. వెనుక నుంచి వచ్చి ఆమెను అసభ్యంగా తాకి జనంలో కలిసిపోయాడు. కాని ఇది ఎవరో రికార్డు చేసి సోషల్ మీడియాలో పెట్టారు. బెంగళూరు పోలీసులు అతన్ని పట్టుకోవడానికి రంగంలో దిగారు. రద్దీ ప్రదేశాల్లో స్త్రీలను అసభ్యంగా తాకడం కొందరికి అలవాటు. వీరితో ఎలా అప్రమత్తంగా ఉండాలి? వీరు మన ఇంటి మగవారే అయితే ఏ విధంగా సంస్కరించాలి?

మొన్నటి ఆదివారం జరిగింది ఇది: బెంగళూరులోని ఒక భారీ మాల్‌లో తన కుటుంబంతో షాపింగ్ చేస్తున్న జయప్రకాష్ (30)కి అతని చెల్లెలు దూరంగా ఉన్న ఒక వ్యక్తిని చూపింది. అన్నయ్యా... అతను ఆడవాళ్లను తాకుతున్నాడు అని చెప్పింది. జయప్రకాష్ పెద్దగా పట్టించుకోలేదు కాని కాసేపు ఆ వ్యక్తినే గమనిస్తే అతడు ఉద్దేశపూర్వకంగా ఆడవాళ్లను తాకుతున్నాడని అర్థమైంది. మాల్ రద్దీగా ఉండటంతో అతడు తాకుతున్నా ఆడవాళ్లు ఏదో యాదృచ్ఛికంగా తగిలాడు అన్నట్టుగా ముందుకు కదిలిపోతున్నారు. జయప్రకాష్ వెంటనే తన కెమెరాతో ఆ వ్యక్తి చర్యను రికార్డు చేశాడు. మాల్ వారికి కంప్లయింట్ చేశాడు. అంతేకాదు, సోషల్ మీడియాలో పెట్టాడు. అంతే! ఆ వీడియో దావానలంలా వ్యాపించింది. మాల్ వాళ్లిచ్చిన కంప్లయింట్ ఆధారంగా ఐపిసి సెక్షన్ 354 కింద కేసు నమోదు చేసిన పోలీసులు అతణ్ణి సీసీ కెమెరాల ద్వారా గుర్తించి ఆశ్చర్యపోయారు. ఎందుకంటే ఆ వ్యక్తి బెంగళూరుకు చెందిన ఒక రిటైర్డ్ హెడ్‌మాస్టర్. 8 నెలల క్రితమే రిటైర్ అయ్యాడు. వీడియో వైరల్ కావడంతో పోలీసులు రావడం కంటే ముందే అతను కుటుంబంతో సహా ఇంటికి తాళం వేసి ఎటో వెళ్లిపోయాడు. అయినా పోలీసులు వెతుకుతున్నారు.

ఒక 'చిన్న దుశ్చర్య'- దారుణ ఫలితం: ఆడవాళ్లను పబ్లిక్ ప్లేసుల్లో అసభ్యంగా కొన్ని సెకన్లపాటు తాకడం పెద్ద తప్పేం కాదని మగవారనుకుంటారు. ఇది 'అత్యాచారం' కాదు కదా. బలవంతం చేయడం కాదు కదా... వారికి తెలిసే లోపల తాకి వెళ్లిపోతాం కదా అనుకుంటారు. కాని ఆ సెకన్ల చర్య కూడా స్త్రీలకు తెలుస్తుంది. వికారం కలిగిస్తుంది. ఇప్పుడు ఈ రిటైర్డ్ హెడ్‌మాస్టర్ చేసిన చర్య బయట పడటంతో అతని పరువు, మర్యాదలు గంగలో కలిశాయి. కన్నడ టీవీ చానెళ్లు అతడి ఫొటో పెట్టి బజారుకు ఈడ్చాయి. పోలీసు కేసు నిరూపితమైతే శిక్ష కూడా పడుతుంది. బహుశా అతనికి ఎదిగొచ్చిన పిల్లలు, కొడుకు, కోడలు, కూతురు... వీరంతా ఉంటే వారి కుటుంబాలు కూడా మాటలు పడాలి. ఇవన్నీ మగవారు ఎందుకు ఆలోచించరు?



మ్యాన్ టచింగ్: ఇలా ఆడవాళ్లను పబ్లిక్ ప్లేసుల్లో తాకడాన్ని 'మ్యాన్‌టచింగ్' అని కొందరు అంటారు. ఒక స్త్రీ శరీరం అందుబాటులోకి వస్తే దానిని తాకొచ్చనే గుంపులో గోవింద స్వభావం మగవాణ్ణి ఇందుకు ఉసిగొల్పుతుంది. లైంగిక అభద్రతలు కొందరిని ఇలా చేయడానికి ప్రేరేపిస్తే, లైంగిక ఉద్రేకం కోసం కొందరు ఇలా చేస్తారు. గమనించాల్సిందేమంటే ఈ మగవారంతా మిగతా సమయాల్లో 'పరువు, మర్యాద, మంచి ఉద్యోగం' ఉన్న వ్యక్తులే. అపరిచితులు, పరిచితులు కూడా ఇలా చేస్తారు. ఎవరూ గమనించకుండా శరీర భాగాలు తాకేవారు కొందరైతే, వేదికల మీద పెళ్లిళ్లు, శుభకార్యాలలో పెద్దరికం వహిస్తూ బుగ్గలు పుణకడం, భుజాల చుట్టూ చేతులు వేసి దగ్గరకు తీసుకోవడం మరికొందరు చేస్తారు. ఇవన్నీ స్త్రీల అనుమతి లేకుండా వారిని తాకడంగానే భావించాలి.

మగవాళ్ల దొంగసాకులు: 1. కొంచెమలా రాసుకుంటే ఏమవుతుంది అనుకోవడం... ఆమె మరీ రెచ్చగొట్టేలా ఉంది అనడం. 2. ఆమె నన్ను రెచ్చగొట్టి తాకేలా చేసింది అనడం 3. పరిచయం ఉన్న ఆమేగా... ఏమనుకుంటుందిలే అనుకోవడం 4. ఆమె పట్ల నా ఇష్టాన్ని తెలిపేందుకు అనడం... ఇలా ఏం చెప్పినా ఒక స్త్రీని ఆమె అనుమతి లేకుండా ఎక్కడా తాకకూడదు.

నిలువరించాలి: స్త్రీలు బహిరంగ ప్రదేశాలలో 'ఎందుకులే రచ్చ' అనుకోకుండా ఇలా అసభ్యంగా తాకే వారిని వెంటనే నిలువరించాలి. చూపు ద్వారా, మాట ద్వారా వీరిని ఒక్క క్షణంలో నిలువరించవచ్చు. సాయం తీసుకుని పోలీసులకు పట్టివ్వొచ్చు. పరిచితులు అస్తమానం తాకుతూ ఉన్నా వారికి మొహమాటం లేకుండా తాకొద్దని చెప్పేయాలి. ముఖ్యంగా పిల్లలకు పబ్లిక్ ప్లేసుల్లో ఎవరినీ తాకనీకుండా చూసుకోవాలని హెచ్చరించాలి.

మన ఇంటి మగవారు: పై కేసులోని రిటైర్డ్ హెడ్‌మాస్టర్‌కు కూడా ఒక ఇల్లు ఉంటుంది. ఇలా ఆడవాళ్లను తాకాలని చూసే మగవారు ఏ ఇంటిలో అయినా ఉండొచ్చు. ఇంటి ఆడవాళ్లు మాటల్లో మాటగా ఎవరైనా పబ్లిక్ ప్లేసుల్లో తమను తాకితే ఎంత కంపరంగా ఉంటుందో చెబుతుండాలి. అలా చేసిన వారిని పబ్లిక్‌గా పట్టుకొని దండిస్తే ఎంత అవమానంగా ఉంటుందో చెప్పాలి. స్త్రీలను గౌరవించి వారికి అసౌకర్యం కలిగించే ఏ పనీ చేయరాదని తప్పక చెప్పాలి. అలాగే సామాజిక ఆరోగ్యం కోసం మగవారు తమ చపలత్వాన్ని నివారించుకోవడం తప్పక అభ్యాసం చేయాలి- దొరికి దెబ్బలు తినడం కంటే అదే మేలు.

పురస్కారం

షేక్‌స్పియరే తన పవర్

'ఏ యుద్ధం ఎందుకు జరిగెనో? ఏ రాజ్యం ఎన్నాళ్లుందో?

తారీఖులు, దస్తావేజులు... ఇవి కావోయ్ చరిత్రకర్థం'... మహాకవి మాట తిరుగులేని సత్యం అయినప్పటికీ కొన్నిసార్లు యుద్ధాలు, తారీఖులు, ప్రేమ పురాణాలు, ముట్టడికైన ఖర్చులు... చారిత్రక పరిశోధనకు అవసరం. ఏ సమాచారమూ వృథా పోదు.


వర్తమానంలో ఉండి ఆనాటి మొగల్, బ్రిటిష్ ఇండియాలోకి వెళ్లడం అంత తేలిక కాదు.

అలుపెరగని పరిశోధన కావాలి. అంతకుముందు కనిపించని ప్రత్యేక వెలుగు ఏదో ఆ పరిశోధనలో ప్రతిఫలించాలి.

అందమైన శైలికి అద్భుతమైన పరిశోధన తోడైతే...అదే 'కోర్టింగ్ ఇండియా' పుస్తకం.

ప్రొఫెసర్ నందిని దాస్ రాసిన 'కోర్టింగ్ ఇండియా: ఇంగ్లాండ్, మొఘల్ ఇండియా అండ్ ది ఆరిజిన్స్ ఆఫ్ ఎంపైర్' పుస్తకం ప్రతిష్ఠాత్మకమైన బ్రిటిష్ అకాడమీ బుక్ ప్రైజ్–2023 గెలుచుకుంది...





● నందినీ దాస్

ఇంట్లో, తరగతి గదిలో, పుస్తకాల్లో, టీవీల్లో విన్న కథల ద్వారా నందిని దాస్‌కు షేక్‌స్పియర్ ఇష్టమైన రచయితగా మారాడు. ఆ మహా రచయితపై ఇష్టం ఆంగ్ల సాహిత్యంపై ఇష్టంగా మారింది. ఆయన పుస్తకాలు తన మనోఫలకంపై ముద్రించుకుపోయాయి.

అలనాటి ప్రయాణ సాహిత్యం నుంచి భిన్న సంస్కృతుల మధ్య వైరుధ్యాల వరకు నందినికి ఎన్నో అంశాలు ఆసక్తికరంగా మారాయి. పరిశోధిస్తూ, రాసే క్రమంలో తన మానసిక ప్రపంచం విశాలం అవుతూ వచ్చింది.

యూనివర్శిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్‌లో నందిని దాస్ ప్రొఫెసర్. షేక్‌స్పియర్ సాహిత్యం ఆమెకు కొట్టిన పిండి. ఆమె పేరు పక్కన కనిపించే విశేషణం...'స్పెషలిస్ట్ ఇన్ షేక్‌స్పియర్ స్టడీస్'

కోల్‌కతాలోని జాదవ్‌పూర్ యూనివర్శిటీలో బీఏ ఇంగ్లీష్ చేసింది నందిని. ఆ తరువాత స్కాలర్‌షిప్‌పై యూనివర్శిటీ కాలేజి, ఆక్స్‌ఫర్డ్‌లో చేరింది. కేంబ్రిడ్జ్, ట్రినిటీ కాలేజిలో ఎంఫిల్, పీహెచ్‌డీ చేసింది. ఒక ప్రచురణ సంస్థలో సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్‌గా పని చేసిన నందిని సంవత్సరం తరువాత మళ్లీ అకాడమిక్ రిసెర్చ్‌లోకి వచ్చింది.

ఇక తాజా విషయానికి వస్తే...

'ది పవర్ ఆఫ్ గుడ్ రైటింగ్'గా విశ్లేషకులు కీర్తించిన 'కోర్టింగ్ ఇండియా' యూరోపియన్‌ల హింసా ధోరణి గురించి చెప్పింది. రాయబార కార్యాలయాల అసమర్థతను ఎత్తి చూపింది. మొఘల్ రాజకీయాలను ఆవిష్కరించింది.

'ఆనాటి బ్రిటన్, ఇండియాలకు సంబంధించి వాస్తవిక చిత్రాన్ని ఆవిష్కరించింది నందిని. మొగల్ రాజుల ఒడిదొడుకుల నుంచి బ్రిటీష్ వైఖరి వరకు ఈ పుస్తకంలో ఎన్నో కనిపిస్తాయి' అంటాడు బ్రిటీష్ అకాడమీ బుక్‌ప్రైజ్– ఛైర్ ఆఫ్ ది జ్యూరీ ప్రొఫెసర్ చార్లెస్ ట్రిప్.

వంటిల్లు

చలి కొరుకుడుని తట్టుకోవాలంటే నోటికి కాస్త వేడివేడి రుచులు తగలాల్సిందే. వేడితోపాటు కారం, కరకర లాడే కమ్మదనం తోడయితే చలిని కూడా కొరికేయవచ్చని చెబుతోంది ఈ వారం వంటిల్లు.

చలిని వెచ్చగా కొరికేద్దాం!



పొటాటో పాన్‌కేక్స్

కావలసినవి: ఉడికించి చిదుముకున్న బంగాళ దుంపలు – రెండు కప్పులు; గుడ్డు – ఒకటి; మైదా – ముప్పావు కప్పు; స్ప్రింగ్ ఆనియన్ తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; చీజ్ తరుగు – కప్పు; క్యారట్ తురుము – అర కప్పు; ఉప్పు – రుచికి సరిపడా; మిరియాల పొడి – రెండు టీస్పూన్లు; నూనె – అరకప్పు; పుల్లటి పెరుగు – గార్నిష్‌కు సరిపడా.

తయారీ: ● గిన్నెలో చిదిమిన దుంపల మిశ్రమం, గుడ్డుసొన, మైదా, స్ప్రింగ్ ఆనియన్, చీజ్ తరుగు, మిరియాలపొడి, రుచికి సరిపడా ఉప్పువేసి కలపాలి ● ఈ మిశ్రమం చేతులకు అంటుకుంటున్నట్లు అయితే మరో టేబుల్ స్పూను మైదా వేసి కలపాలి ● పిండి ముద్దను ఇరవై నిమిషాలు పక్కన పెట్టుకోవాలి ● ఇరవై నిమిషాల తరువాత పిండిని చిన్నచిన్న ముద్దలుగా చేసి పాన్‌కేక్‌లా వత్తుకోవాలి ● బాణలిలో నూనె వేయాలి. బాగా కాగిన నూనెలో ఒక్కో పాన్‌కేక్‌ను వేసి మీడియం మంట మీద కాల్చాలి ● క్రిస్పీగా బ్రౌన్ కలర్‌లోకి మారాక పాన్‌కేక్‌లను తీసేయాలి ● పాన్‌కేక్ పైన కొద్దిగా పుల్లటి పెరుగువేసి సర్వ్ చేసుకోవాలి.



పోహా వెజ్ కట్‌లెట్

కావలసినవి: అటుకులు – కప్పు; ఉడికించిన బంగాళ దుంపలు – రెండు; క్యాప్సికం తరుగు – రెండు టీస్పూన్లు; క్యారట్ తురుము – రెండు టీస్పూన్లు; పచ్చిబఠాణి – రెండు టేబుల్ స్పూన్లు; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; ధనియాల పొడి – టీస్పూను; చాట్ మసాలా – టీస్పూను; కారం – టీస్పూను; పచ్చిమిర్చి పేస్టు – టీస్పూను; కార్న్‌ఫ్లోర్ – రెండు టేబుల్ స్పూన్లు; బ్రెడ్ ముక్కల పొడి – కప్పు; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● అటుకులను శుభ్రంగా కడిగి పదినిమిషాలు నానబెట్టుకోవాలి ● పదినిమిషాల తరువాత నానిన అటుకుల్లో తొక్కతీసిన దుంపలు, బఠాణి, క్యాప్సికం, క్యారట్, కొత్తిమీర తరుగు వేయాలి ● పచ్చిమిర్చి పేస్టు, చాట్ మసాలా, ధనియాల పొడి, రుచికి సరిపడా ఉప్పు వేసి ముద్దలా కలపాలి ● పిండిని ఉండలుగా చేసి, కట్‌లెట్‌లా వత్తుకుని పక్కన పెట్టుకోవాలి ● కార్న్‌ఫ్లోర్‌లో నీళ్లు పోసి పేస్టులా కలపాలి ● ఒక్కో కట్‌లెట్‌ను కార్న్‌ఫ్లోర్ పేస్టులో ముంచి, తరువాత బ్రెడ్ ముక్కల పొడిని అద్దాలి ● బ్రెడ్ ముక్కల పొడి అద్దిన తరువాత డీప్ ఫ్రై చేసుకోవాలి ● గోల్డెన్ కలర్‌లోకి మారాక తీసి సాస్ లేదా గ్రీన్ చట్నీతో సర్వ్ చేయాలి.



పనీర్ కుర్‌కురే

కావలసినవి: నిలువుగా కోసిన పనీర్ ముక్కలు – రెండు కప్పులు; పసుపు – టీస్పూను; కారం – టీస్పూను; ఉప్పు – రుచికి సరిపడా; కసూరీ మేథీ – టేబుల్ స్పూన్; వాము – అరటీస్పూను; చాట్ మసాలా – టీస్పూను; గరం మసాలా – టీస్పూను; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; అల్లం వెల్లుల్లి పేస్టు – టేబుల్ స్పూను; కార్న్‌ఫ్లేక్స్ – రెండు కప్పులు; శనగపిండి – రెండు కప్పులు; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● పనీర్ ముక్కలపైన చిటికెడు సాల్ట్, కారం, టేబుల్ స్పూను కొత్తిమీర తరుగు, చాట్ మసాలా వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి ● పెద్ద గిన్నె తీసుకుని శనగపిండి, వాము, అల్లం వెల్లుల్లి పేస్టు, కసూరీ మేథీ, గరం మసాలా, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి ● ఇప్పుడు నీళ్లు పోసి బజ్జీపిండిలా కలుపుకొని పక్కన పెట్టుకోవాలి ● ఒక ప్లేటులో కార్న్ ఫ్లేక్స్‌ను నలిపి పెట్టుకోవాలి ● ఇప్పుడు ఒక్కో పనీర్ ముక్కను తీసుకుని ముందుగా శనగపిండి మిశ్రమంలో ముంచాలి. తరువాత కార్న్‌ఫ్లేక్స్‌ను అద్ది సలసలా కాగుతోన్న నూనెలో వేసి డీప్‌ఫ్రై చేయాలి ● పనీర్ ముక్క క్రిస్పీగా మారితే పన్నీర్ కుర్‌కురే రెడీ.



పాలక్ మేథీ పూరీ

కావలసినవి: జీలకర్ర – టేబుల్ స్పూను; సోంపు – టేబుల్ స్పూను; వాము – టీస్పూను; నువ్వులు – టేబుల్ స్పూను; ధనియాల పొడి – టేబుల్ స్పూను; పచ్చిమిర్చి – మూడు; అల్లం తరుగు – టీస్పూను; కరివేపాకు – రెండు రెమ్మలు; పాలకూర తరుగు – రెండు కప్పులు; మెంతికూర తరుగు – కప్పు; గోధుమ పిండి – రెండు కప్పులు; శనగపిండి – పావు కప్పు; పసుపు – అరటేబుల్ స్పూను; ఉప్పు – రుచికి సరిపడా; కారం – టేబుల్ స్పూను; నూనె –డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● జీలకర్ర, సోంపు, నువ్వులు, వాము, ధనియాల పొడి, పచ్చిమిర్చి; అల్లం తరుగు, కరివేపాకుని మిక్సీజార్‌లో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి ● పాలకూర, మెంతికూర తరుగుని గిన్నెలో వేయాలి. దీనిలోనే గోధుమపిండి, శనగపిండి, కారం, పసుపు, గ్రైండ్ చేసిన మసాలా పొడి, రుచికి సరిపడా ఉప్పు, టేబుల్ స్పూను నూనె వేసి కలపాలి ● ఈ మిశ్రమంలో కొద్ది కొద్దిగా వేడినీళ్లు చల్లుకుంటూ ముద్దలా కలపాలి ● పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసి పూరీలా మందంగా వత్తుకోవాలి ● గుండ్రని గిన్నె లేదా చిన్న గ్లాసుతో పూరీని చిన్న చిన్న చెక్కల్లా కట్ చేయాలి ● అన్నీ రెడీ అయ్యాక క్రిస్పీగా మారేంత వరకు డీప్ ఫ్రై చేస్తే రుచికరమైన పాలక్ మేథీ పూరీ రెడీ.